ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 3 కర్ణాటక వార్తలు
శుక్రవారం 5 సెప్టెంబరు 2025

పరప్పన జైలులో ఎలుగుబంటి సంచారం

బెంగళూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ సిటీ పరిధిలోని పరప్పన అగ్రహార సెంట్రల్ జైలు ప్రాంగణంలో బుధవారం ఎలుగుబంటి సంచారం కలకలం రేపింది. విచారణ ఖైదీ నటుడు దర్శన్‌కు చెందిన సెల్ కాంపౌండ్ సమీపంలోనే ఎలుగుబంటి కనిపించింది. ఎలుగుబంటి పరుగులు తీస్తున్న వీడియోలను సిబ్బంది తీసుకున్నారు. జైలు ప్రాంగణంలోనే ఎలుగుబంటి కనిపించడంతో జైళ్ళ శాఖ అధికారులు అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఓపెన్ జైలు కావడంతో పంటపొలాల నుంచి వచ్చి ఉండవచ్చునని భావించారు. ఖైదీలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.


సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్ సెక్రటరీ శాలినీ రజనీష్

ఆవాస్ దరఖాస్తుల్లో ఆలస్యం తగదు

- సత్వరమే రుణాలు మంజూరు చేయాలి
- లబ్ధిదారుల గుర్తింపునకు గ్రామీణ బ్యాంకులు చొరవ చూపాలి
- బ్యాంకర్ల సమావేశంలో సీఎస్ శాలినీ రజనీష్

బెంగళూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ యోజనకు సంబంధించిన దరఖాస్తులకు అనుగుణంగా వెంటనే రుణాలు మంజూరు చేయాలని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాలిని రజనీష్ సూచించారు. బుధవారం ఎస్ఎల్‌బీసీ 171వ సభ లీడ్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ భవేంద్రకుమార్ పర్యవేక్షణలో విధానసౌధలో జరిగింది ఈసందర్భంగా శాలినీ రజనీష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన టార్గెట్‌లను సకాలంలో పూర్తి చేయాలన్నారు. పథకాల ద్వారా అర్హులైన లబ్దిదారులను గుర్తించడం కూడా కీలకమే అన్నారు. జనసురక్షా సామాజిక భద్రతా పథకాలను అర్హులకు అందించేందుకు గ్రామీణ ప్రాంతాలలోని బ్యాంకులు చొరవ చూపాలన్నారు. కెనరా బ్యాంక్ ఈడీ భవేంద్రకుమార్ మాట్లాడుతూ ఇప్పటికే అన్ని బ్యాంకులకు సంబంధించి ప్రభుత్వ పథకాల లబ్దిదారుల రుణాలను టార్గెట్‌కు అనుగుణంగా పూర్తి చేయాలని సూచించినట్లు తెలిపారు. ప్రభుత్వ అదనపు ముఖ్య కార్యదర్శి డెవలప్‌మెంట్ కమిషనర్ ఉమామహదేవన్, రిజర్వు బ్యాంక్ రీజనల్ డైరెక్టర్ సోనాలిసేన్ గుప్తా, రిజర్వు బ్యాంక్ ఫైనాన్స్ ఇన్‌క్లూజన్ విభాగం జనరల్ మేనేజర్ మీనాక్షిగంజు, నబార్డు జీఎం పిసి దాశ్, ఎస్ఎల్‌బీసీ రాష్ట్ర సంచాలకులు భాస్కర్ చక్రవర్తి, వివిధ శాఖల ముఖ్యులు పాల్గొన్నారు.

కాల్చేసిన బీడీ

- తాగి పడేసిన బీడీతో రాజుకున్న మంటలు
- వృద్ధుడి సజీవదహనం ● మైసూరు జిల్లాలో దారుణం

5

శరవేగంగా

- గంగాకల్యాణ పథకంలో ఆలస్యానికి చెక్ ● లబ్ధిదారుల ఎంపికకు కొత్త విధానం
- కలెక్టర్ అధ్యక్షతన సమితికి అధికారం ● సీఎం ఆదేశాలతో మార్పులు



బెంగళూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సన్నకారు రైతులు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు గంగా కల్యాణ పథకం సకాలంలో అందడం లేదనే విమర్శలు ఉన్నాయి. దీనికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం పథకంలో కీలక మార్పులు ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. చిన్న, సన్నకారు రైతులకు అండగా ఉండేందుకు రాష్ట్రప్రభుత్వం గంగా కల్యాణపథకాన్ని ప్రవేశపెట్టింది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, వెనుకబడిన వర్గాలు, మైనారిటీల వర్గాల రైతులకు అండగా ఉండాలని బోరుబావులు తవ్వించడానికి, పంప్‌సెట్లను అమర్చుకునేందుకు ఈ పథకం దోహదపడనుంది. అయితే ఈ పథకానికి లబ్ధిదారుల ఎంపికలో తీవ్రమైన జాప్యం జరుగుతున్న తరుణంలో దీన్ని అధిగమించేందుకు ప్రభుత్వం సరికొత్త విధానానికి సిద్ధమైంది. లబ్ధిదారుల ఎంపిక ఓ సవాల్‌గా ఉండడంతో జిల్లా అధికారి (డీసీ) అధ్యక్షతన సమితికి అధికారం కట్టబెట్టదలిచారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య సూచనతోనే ఈ ప్రస్తావన తెచ్చారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ, ఎస్టీ వర్గాల కోసం సబ్‌ప్లాన్ కింద గ్రాంట్లు కేటాయించారు. అయితే ఇప్పటికే నాలుగు నెలలు గడిచింది. గత ఆర్థిక సంవత్సరం లక్ష్యాలను అందుకోకపోవడంతో అర్హులకు పథకాలు అందేది ఎప్పుడని సీఎం ఆగ్రహం చేసినట్లు తెలుస్తోంది. సాంఘిక సంక్షేమశాఖ, ఎస్సీ, ఎస్టీ మండలులు గంగా కల్యాణ, స్వయం ఉపాధి, స్వావలంబి సారథి వంటి పథకాలకు ఆయా ఆర్థిక సంవత్సరంలో అక్టోబరు 31వరకు గడువు విధించారు. గడువులోగా ఎమ్మెల్యేలు లబ్ధిదారులను ఎంపిక చేయలేకపోతే జిల్లా అధికారులకు అధికారం ఇవ్వాలని సీఎం సూచించినట్లు తెలుస్తోంది.

వార్షిక ఆదాయం రూ.96 వేల లోపే

సాధారణంగా గంగాకల్యాణ పథకానికి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ.96వేల లోపు ఉండాలని ప్రభుత్వం సూచించింది. రాష్ట్రంలో శాశ్వత నివాసులై ఉండాలి. 18-55 ఏళ్లలోపువారు ఈ పథకానికి అర్హులు. 1983లో ఈ పథకం ప్రవేశపెట్టారు. వివిధ మండలుల నుంచి ఈ పథకం ద్వారా సబ్సిడీ ఇస్తున్నారు. సబ్సిడీ రూ.2లక్షలనుంచి గరిష్ఠంగా రూ.4.25 లక్షలవరకు పొందే అవకాశం ఉంది. రుణంగా రూ.50వేల దాకా 4శాతం వడ్డీతో లభించనుంది.


గంగా కల్యాణ పథకంలో వేయించిన బోరు(ఫైల్)

గడువు విస్తరణ సాధ్యం..?

గంగాకల్యాణ పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు వారి పొలంలో బోరు బావులు తవ్వించడం, పంప్‌సెట్ల అమరిక, విద్యుద్దీకరణకు ప్రస్తుతం ఉన్న కాంట్రాక్టర్లకు మరో రెండేళ్లు పొడిగించే అవకాశం ఉంది. 55 బోర్లను తవ్వడం, పంప్‌సెట్ల అమరికకోసం 18మంది కాంట్రాక్టర్లను 2022లో జిల్లాలా వారీగా ఎంప్యానెల్ చేశారు. రెండేళ్లకు ఒప్పందం చేశారు. 2023-24లో లక్ష్యంతో పాటు అంతకుముందు పెండింగ్‌లో ఉన్న బోర్లను తవ్వడం, పంప్‌సెట్లను పూర్తి చేయాలని ఆదేశించడంతో పనుల ప్రక్రియ ప్రగతిదశలో ఉంది. బోరుబావులు తవ్వడం, పంప్‌సెంట్ల అమరికకు సంబంధించి బిల్లుల చెల్లింపునకు ఎక్కువ సమయం పడుతోంది. అన్ని బిల్లులు మండలి కేంద్రం కార్యాలయం ఖజానా నుంచి పాస్ చేసిన అనంతరం ఇండియన్ బ్యాంకులోని ఎస్కో ఖాతా ద్వారా ఈ-రుపీ సృష్టించి చెల్లించాల్సి ఉంటుంది. అయితే కొత్త ఆదేశాల ప్రకారం మండలులకు చెందిన గ్రాంట్లను బ్యాంకు ఖాతాల్లో జమ చేయాల్సిన అవసరం ఉండదు, జిల్లాస్థాయిలో బిల్లుల చెల్లింపులకు అవకాశం ఉండదు. మండలుల గ్రాంటు ట్రెజరీలోని పీడీ ఖాతాలో జమ చేయనున్నారు. సుదీర్ఘమైన ప్రక్రియ, లబ్ధిదారుల ఎంపికలో జాప్యం వంటి కారణాలు లక్ష్యాన్ని చేరుకోవడానికి సమస్యగా ఉంది. ప్రస్తుత స్థితిగతులకు అనుగుణంగా ఎంప్యానెల్ అయిన కంట్రాక్టర్ల ఒప్పందం గడువును 2027 జూన్ వరకు విస్తరించదలిచారు.

77 నియోజక వర్గాల్లో ఎంపిక ప్రక్రియ లేదు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అభివృద్ధి మండలిలో 2024-25 వార్షిక సంవత్సరానికి 77 నియోజకవర్గాల్లో లబ్ధిదారుల ఎంపిక జరగలేదు. ఇతర మండలుల పరిస్థితి కూడా ఇంతకు భిన్నంగా లేదు. రెండు శాఖలకు సంబంధించి 2025-26లో బోరుబావుల తవ్వకం లక్ష్యం అందుకోలేదు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదు. సీఎం సూచించిన గడువు పూర్తి కావడానికి దాదాపు రెండు నెలల సమయం ఉంది. కొన్ని చోట్ల నిరంతర వర్షాల కారణంగా బోరు బావులను తవ్వలేదని తెలుస్తోంది.

బ్యాలెట్ విధానంలోనే స్థానిక ఎన్నికలు

- ఎన్నికల కమిషన్‌కు సిఫారసు
- కనకపురలో వైద్య కళాశాల ఏర్పాటు
- రైతులపై నమోదైన 60 కేసుల రద్దు
- కేబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలు



బెంగళూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీలు, నగర పాలికెసంస్థల ఎన్నికలను బ్యాలెట్ పేపర్ పద్ధతిలోనే నిర్వహించాలని మంత్రివర్గం తీర్మానించింది. గురువారం సాయంత్రం విధానసౌధలో మంత్రివర్గ సమావేశం సీఎం సిద్దరామయ్య అధ్యక్షతన జరిగింది. కేబినెట్ తీర్మానాలను శాసనసభా వ్యవహారాల శాఖామంత్రి హెచ్‌కే పాటిల్ మీడియాకు వివరించారు. ఇకపై స్థానిక సంస్థల ఎన్నికలు బ్యాలెట్‌పేపర్ విధానంతోనే నిర్వహించాలని తీర్మానించినట్లు తెలిపారు. ఇదే విషయాన్ని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు సిఫారసు చేయాలని మంత్రివర్గంలో నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఓటరు జాబితాను సిద్ధం చేసుకోవడంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి అవసరమైన నిబంధనల అమలు కోసం సవరణలు తీసుకురావాలని నిర్ణయించామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు అన్నింటినీ బ్యాలెట్ ద్వారానే జరపాలని తీర్మానించారు. డీసీఎం డీకే శివకుమార్ ప్రాతినిథ్యం వహిస్తున్న కనకపురకు అనుబంధమైన రాయసంద్ర గ్రామంలో కొత్త మెడికల్ కళాశాల ఏర్పాటుకు తీర్మానించారు. కర్ణాటక గృహమండలి రూ.65కోట్లతో 25 ఎకరాల భూమిని కొనుగోలు చేసేందుకు పాలనాపరమైన అనుమతులకు అంగీకరించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలోను ఆశాకిరణ పథకం అమలు చేయదలచారు. తద్వారా అందరికీ ఉచిత కంటి వైద్య శిబిరాల ద్వారా పరీక్షలు జరిపించేందుకు రూ. 52.85 కోట్ల రూపాయల గ్రాంటు ఇచ్చేందుకు తీర్మానించారు. రైతులు, కన్నడ పోరాట నేతలపై నమోదు చేసిన 60 కేసులను రద్దు చేయాలని ఏకగ్రీవంగా ఆమోదించారు. వ్యవసాయ మార్కెటింగ్ కమిటీల సుంకం 41పైసల నుంచి 42 పైసలకు పెంచుతూ తీర్మానించారు. బెంగళూరులో మెట్రో ఎలివేటెడ్ కారిడార్ నిర్మించేందుకు తీర్మానించారు. మెట్రో స్టేజ్- 3లో భాగంగా జేపీనగర్ 4వ స్టేజి హెబ్బాళ దాకాను. హొసహళ్ళి నుంచి మాగడి రోడ్ కడబగెరె దాకా 37. 12 కిలోమీటర్ల పొడవుతో డబుల్ డెక్కర్‌ల నిర్మాణాలకు అంగీకరించారు. మంత్రివర్గ సమావేశంలో ఏకంగా 70 అంశాలకు సంబంధించి చర్చలు జరిపి ఆమోదించారు.


గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న విద్యార్థి

ఉద్యోగాల సృష్టిపై దృష్టి పెట్టాలి

- సమాజానికి దిశానిర్దేశం చేయాల్సిన బాధ్యత యువతదే
- రాయలవారు నడయాడిన నేలలో కళలకు కొదవ లేదు
- వీఎస్‌కేయూ 13వ స్నాతకోత్సవంలో గవర్నర్ గెహ్లాట్
- 93 మందికి బంగారు పతకాల ప్రదానం

బళ్లారి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): నవసమాజ రూపకర్తలుగా యువత బాధ్యతలు తీసుకుని దేశానికి దిశానిర్దేశం చేయాల్సిన అవసరం ఉందని చాన్స్‌లర్ హోదాలో గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ విద్యార్థులకు సూచించారు. పట్టభద్రులైన వారు ఉద్యోగం కోసం ఎదురు చూడకుండా ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదగాలని ఆయన అన్నారు. గురువారం విజయనగర శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం(వీఎస్‌కేయూ) 13వ స్నాతకోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ మునిరాజు అధ్యక్షతన వహించారు. ముందుగా వీసీ యూనివర్సిటీలో పలు కోర్సుల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ విజయనగర పాలకులు శ్రీకృష్ణదేవరాయులు నడియాడిన గడ్డ ఇది. ఇక్కడ సర్వకళలు, సంపద, సంస్కారం, కలిగిన నేల ఇది ఇలాంటి నేలలో ఉండే వారు గొప్పగా ఎదుగుతారని భావిస్తాననన్నారు. విద్యార్థులు చదువు పూర్తి చేసుకుని ఉద్యోగాల కోసం కాకుండా ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదగాలన్నారు. న్యూఢిల్లీ ఇంటర్- యూనివర్సిటీ యాక్సిలరేటర్ డైరెక్టర్ , ప్రొఫెసర్ అవినాష్ చంద్ర పాండే మాట్లాడుతూ స్నాతకోత్సవం కేవలం వేడుక కాదన్నారు. ప్రతి విద్యార్థి కృషి, క్రమశిక్షణ, జీవితంలో అలవర్చుకుని . ఉన్నత లక్ష్యం కోసం ధృడంగా ఎదగాలన్నారు. యూజీ,పీజీ అనే పట్టాలు జీవిత లక్ష్యం కాదని, జీవితాంతం నేర్చుకోవాల్సిన అంశాలు చాలా ఉన్నాయన్నారు. చదువు అయిపోయింది అనుకోవడం తప్పని జీవితాంతం ఎంత చదవినా తక్కువే అని అన్నారు. కార్యక్రమంలో వీరితో పాటు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ నాగరాజ్. సి, రిజిస్ట్రార్ (అసెస్‌మెంట్) ప్రొఫెసర్ ఎన్.ఎం. సాలి. విశ్వవిద్యాలయం సిండికేట్ సభ్యులు, అడక్‌కమిటీ కౌన్సిలర్ , డీన్‌లు, అధిపతులు, అన్ని విభాగాల సమన్వయ కర్తలు, వివిధ కళాశాల ప్రిన్సిపాల్స్ బోధన మరియు బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, హాజరయ్యారు.



డాక్టరేట్లకు సన్మానం

వివిధ విభాగాల్లో పరిశోధనలు ఫలితం సాధించిన ముగ్గురిని గవర్నర్, ఉపకులపతి చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. డాక్టర్ ఇఫాన్ రజాక్, డాక్టర్ వసుంధర భూపతి, డాక్టర్ బావిహళ్లి నాగనగౌడ, ఈ ముగ్గురు డాక్టర్ సాధించారు. ఈ ముగ్గురికి గవర్నర్ సత్కరించారు.

యూజీ, పీజీ విద్యార్థులకు సత్కారం

యూనివర్సిటీలో యూజీ, పీజీ చేస్తూ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు వివిధ పతకాలు ఇచ్చి గౌరవించారు. యూజీలో 42 మంది . పీజీలో 51 మంది బంగారు పతకాలు సాధించారు. ఇతర వివిధ విభాగాలకు చెందిన 59 మంది విద్యార్థులు పరిశోధన విభాగంలో డాక్టరేట్ అందుకున్నారు. అన్ని విభాగాల నుంచి 80 మంది యూజీ విద్యార్థులకు 75 మంది పీజీ విద్యార్థులకు మెత్తం 156మందివిద్యార్థులకు ఉత్తమ ర్యాంక్ సర్టిఫికెట్లు అందుకున్నారు.



డాక్టరేట్ గ్రహీతలకు సత్కారం


హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు



నాడు కారాగారం
నేడు విద్యాలయం

బెళగావి జైలు
పాఠశాలకు 102 ఏళ్లు
ఎల్‌కేజీ టు పీయూ దాకా..
ఉత్తమ ఫలితాలతో
రాణిస్తున్న విద్యార్థులు
అత్యధిక అడ్మిషన్లతో
రాష్ట్రవ్యాప్త గుర్తింపు



భవనం పునాదిరాయి

పూర్తిగా రాతితో నిర్మించిన వడగావి జైలుబడి

జైలుబడి

బెంగళూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఖైదీలు శిక్ష అనుభవించిన ప్రదేశంలో ప్రస్తుతం వందలాదిమందికి విద్యాకేంద్రంగా కొనసాగుతోంది. బెళగావి నగరం వడగావిలో వందేళ్లక్రితం అనగా స్వాతంత్ర్యానికి పూర్వంగా ఇక్కడ జైలు ఉండేది. ఒకప్పుడు ఖైదీలు ఉన్నచోట నేడు పిల్లలు స్వేచ్ఛగా చదువుకుంటున్నారు. వడగావిలో 1923 అక్టోబరు 10న బ్రిటీష్ ప్రభుత్వంలోని బ్రిటీష్ అధికారి మేజర్ లి ల్యాంగ్ జైలుకోసం ఈ భవనానికి శంకుస్థాపన చేశారు. సాంగ్లిలోని పటవర్ధన్ సంస్థానానికి చెందిన స్థలంలో భవనాన్ని నిర్మించారు. స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొన్న వారిని ఇక్కడ బంధించేవారు. దేశానికి స్వాతంత్ర్యం లభించాక 1950లో జైలు భవనాన్ని విద్యాశాఖకు అప్పగించారు. ఇక్కడ పాఠశా ఏర్పాటు చేసినా జైలు అనే పదం మాత్రం వీడలేదు. ప్రజలు ఈ భవనాన్ని జైలు స్కూల్ అనే పిలుస్తున్నారు.

అడ్మిషన్లకు పెరిగిన డిమాండ్

ఇక్కడ విద్యాప్రమాణాలు బాగా ఉండి రాణించడంతో అడ్మిషన్లకు డిమాండ్ పెరిగింది. ఒక్కోసారి రాజకీయ నాయకులు, అధికారులు సైతం సిఫారసు చేస్తుంటారు. అంతగా డిమాండ్ ఏర్పడింది. సుమారు అర ఎకరాలో 12 గదులు ఉన్నాయి. ఈ భవనం 1923 అక్టోబరు 10కి 102 ఏళ్ల గడవనున్నాయి. రాతితో నిర్మించిన ఈ భవనం వందేళ్లు గడిచినా నేటికీ చక్కగా ఉంది. బెళగావిలో ప్రముఖమైన హిండలగా జైలు, వడగావి జైలు రెండూ 1923లో నిర్మించారు. అయితే హిండలగా జైలు మాత్రం సెంట్రల్‌జైలుగా కొనసాగుతుంది. వడగావి జైలు భవనం స్వాతంత్ర్యానంతరం పాఠశాలగా మార్పు చేశారు. కన్నడ ప్రాథమికోన్నత పాఠశాల నెంబరు 14. అయితే బెళగావిలో జైలుస్కూల్‌గానే పేరొందింది. నేషనల్ టాలెంట్ ఎగ్జామ్‌లో గత ఏడాదిలో 14మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఎస్ఎల్ఎల్‌సీలో ప్రస్తుత సంవత్సర ఫలితాలలో 85శాతం ఉత్తీర్ణత సాధించారు. అంతేకాక పీయూసీలో వంద శాతం ఫలితాలు సాధించడం విశేషం.


తరగతిలో విద్యార్థులు


పీయూ కళాశాలగా అప్‌గ్రేడ్ చేశాక..

2018 నుంచి కర్ణాటక పబ్లిక్ స్కూల్‌గా నామకరణం

ప్రారంభంలో ప్రభుత్వ కన్నడ మీడియం ప్రాథమిక పాఠశాల మాత్రమే ఉండేది. అనంతరం 2007లో హైస్కూల్, పీయూ కాలేజ్ ఇక్కడ ప్రారంభమైంది. 2018లో కర్ణాటక పబ్లిక్‌స్కూల్‌గా అప్‌గ్రేడ్ చేశారు. జైలు భవనంలో ప్రాథమిక పాఠశాల ఉండగా హైస్కూల్, పీయూ కళాశాల తరగతులకోసం నూతన గదులను నిర్మించారు. మొత్తం 4 ఎకరాల 4 గుంటల్లో కర్ణాటక పబ్లిక్‌స్కూల్ విస్తీర్ణం చేశారు. ప్రాథమిక పాఠశాలలో 980, హైస్కూల్‌లో 260, పీయూలో 560 మంది ఉన్నారు. ప్రస్తుతం ఎల్‌కేజీ నుంచి పీయూ వరకు మొత్తం 1800మంది విద్యార్థులు చదువుతున్నారు. తద్వారా రాష్ట్రంలో అత్యధిక విద్యార్థులు అడ్మిషన్లు పొందిన స్కూల్‌గా జైల్‌స్కూల్ తనదైన గుర్తింపు పొందింది. ప్రధానోపాధ్యాయుడు శశికాంత శింగన్ననవర మాట్లాడుతూ వందేళ్లు గడిచినా ఈ భవనంలో ఎక్కడా చీలికలు రాలేదన్నారు. చారిత్రాత్మక భవనంగా కొనసాగడానికి ఉత్తమ నిర్వహణే సాధ్యమన్నారు. తమ పాఠశాలకు మంచి డిమాండ్ ఏర్పడిందన్నారు.

డీసీసీ చైర్మన్‌గా రాజణ్ణ ఏకగ్రీవం

- మంత్రి పదవి పోయినా దక్కిన హోదా
- వరుసగా ఏడోసారి వరించిన అదృష్టం


చైర్మన్ నియామక పత్రం అందుకుంటున్న రాజణ్ణ

రాష్ట్ర సహకార శాఖా మంత్రి పదవి కోల్పోయిన రాజణ్ణ తుమకూరు డీసీసీ బ్యాంక్ చైర్మన్ హోదాను మరోసారి దక్కించుకున్నారు. వరుసగా ఆయన ఏడోసారి ఏకగ్రీవంగా ఈ పదవి దక్కించుకోవడం విశేషం.

రాయచూరులో అనుమానిత మావోయిస్టు

- రెండేళ్లుగా కర్మాగారంలో కార్మికుడిగా ఉద్యోగం
- పక్కా సమాచారంతో అరెస్ట్ చేసిన బిహార్ పోలీసులు


అనుమానిత మావో మనోజ్ సదా

కేఆర్ మార్కెట్‌తో సంబంధం లేదు

- విదేశాలకు పూలు ఎగుమతి చేయడానికే జీకేవీకేలో నిర్మాణం: అసోసియేషన్ అధ్యక్షుడు అరవింద్

వివరాలు 5లో



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.69	1631.92
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	38,330	39,945
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	36,107	15,235
నీటి నిల్వ (టీఎంసీలు)	78.77	101.46

కల్యాణ కర్ణాటక ఉత్సవానికి ఏర్పాట్లు చేయండి

● అధికారులతో తహసీల్దార్ హలీమా



మాట్లాడుతున్న తహసీల్దార్ హలీమా

బళ్లారి సిటీ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కల్యాణ కర్ణాటక ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని తహసీల్దార్ హలీమా అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రాథమిక సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. సెప్టెంబరు 17న హైదరాబాద్ కర్ణాటక ప్రాంతాలు హైదరాబాద్ నిజాం నుంచి విముక్తి పొందిన రోజని, దీనిని కల్యాణ కర్ణాటక ఉత్సవ దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగరంలోని రాజ్‌కుమార్ రోడ్డు ప్రభుత్వ (మాజీ మున్సిపల్) ప్రీ-యూనివర్శిటీ కళాశాల ప్రాంతంలో కల్యాణ కర్ణాటక విమోచన దినం వేడుకల్లో భాగంగా జెండా ఎగురవేసే కార్యక్రమం ఉంటుందన్నారు. కల్యాణ కర్ణాటక ఉత్సవాన్ని ఘనంగా జరుపుకోవడానికి జిల్లా యంత్రాంగం స్వాగత కమిటీ, స్టేజ్ కమిటీ, సన్మాన కమిటీ, శుభ్రత తాగునీటి కమిటీ, విద్యుత్ కమిటీ సహా పలు కమిటీలను ఏర్పాటు చేసి వారికి బాధ్యతలు అప్పగించారు. వివిధ శాఖలకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆమె ఆదేశించారు. జిల్లాలోని అన్ని తాలూకా స్థాయిలలో పాఠశాలలు, కళాశాలలు, గ్రామపంచాయితీలలో ఉత్సవాలను నిర్వహించేందుకు సంబంధిత తాలూకా తహసీల్దార్లు, శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కన్నడ సాంస్కృతిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.నాగరాజ్‌తో పాటు వివిధ సంస్థల ఆఫీస్ బేరర్లు, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.



తెగులు సోకిన వరి పంటలను పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

వరి పంట పరిశీలన

కంప్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని సన్నాపురం, ఇటిగి, హరిపల్లి తండా, బసవేశ్వర క్యాంపు, నారాయణ స్వామి క్యాంపు తదితర ప్రాంతాల్లో లీఫ్ బ్లైట్ వైరస్ సోకిన వరి పంటలను వ్యవసాయ శాఖాధికారి సోమశేఖర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బీవీగౌడ పరిశీలించారు. 1వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వరికి తెగుళ్లు అనే కథనానికి అధికారులు స్పందించి గురువారం పంటలను పరిశీలించారు. వ్యవసాయాధికారి మాట్లాడుతూ అధిక వర్షం రావడంతో వరి పంటలకు లీఫ్ బ్లైట్ తెగుళ్లు సోకే ప్రభావం వుందన్నారు. వెంటనే రైతులు జాగ్రత్త పడకపోతే నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ వైరస్ సోకిన వరి పంటలకు సెఫ్రోసైక్లిన్, ఏక ఫర్ ఆక్సిక్లోరైడ్ మందులను పిచికారి చేయాలన్నారు. అనంతరం రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ రైతులకు వైరస్ విషయంపై అవగాహన కల్పించాలని, లేనిపక్షంలో ప్రభుత్వమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. చుట్టుపక్కల గ్రామాల్లో ఎక్కడ ఈ తెగులు సోకాయో వ్యవసాయశాఖ అధికారులు సమావేశం ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో తిమ్మప్ప నాయక, కొట్టూరు రమేష్, మురారి, గంగన్న, కృష్ణ, శేఖర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

బళ్లారి సిటీ,సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): నగరంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి గురువారం భూమి పూజ చేశారు. రూ.20లక్షల వ్యయంతో అంగనవాడీ కేంద్ర నిర్మాణ పనులకు, 20వ వార్డు మారుతీ కాలనిలో రోడ్డు నిర్మాణం కోసం రూ.9.52లక్షలు, రూ.11,13లక్షలు 2పనులను ఆయన ప్రారంభించారు. 8వ వార్డులో వర్షపు నీటి కాలువ నిర్మాణం కోసం రూ.80లక్షలతో నిర్మించేందుకు భూమి పూజ నిర్వహించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల లో5 నూతన గదుల నిర్మాణానికి రూ.98లక్షల వ్యయంతో నిర్మించే పనులకు భూమిపూజ చేశారు. పాలక సభ్యుడు రామాంజనేయ, మాజీ మేయర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

మహిళలపై దౌర్జన్యాలను అరికట్టండి: ఏఐఎంఎస్ఎస్



తహసీల్దార్ రేణుకకు వినతి పత్రం ఇస్తున్న ఏఐఎంఎస్ఎస్ సభ్యులు

బళ్లారి సిటీ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రోజురోజుకు మహిళలపై జరుగుతున్న దౌర్జన్యాలను అరికట్టాలని అఖిళబారత మహిళా సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. గురువారం జిల్లాకలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించిన నిరసనలో జిల్లా అధ్యక్షులు ఈశ్వరి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా హక్కుల కోసం నిరంతరం పోరాడుతామన్నారు. బాల్యవివాహాలు, భ్రూణహత్యలు, లింగ వివక్ష, వరకట్నం, గృహ హింస, పోషకాహార లోపం, అభద్రత, శ్రామిక మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. జిల్లాకార్యదర్శి విజయలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికీ భ్రూణ హత్యలు జరగుతునే ఉన్నాయన్నారు. 2024-25 కాలంలో 700కు పైగా బాల్య వివాహాలు నమోదైనట్లు తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వాలు స్పందించాలన్నారు. పలు సామాజిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్ రేణుక ద్వారా ముఖ్యమంత్రికి వినతి పత్రం పంపారు. గిరిజా, సౌమ్య, రేఖా, అబిలాషా, పద్మా పాల్గొన్నారు.

తుంగభద్ర డ్యాం సమస్యలపై 8న ఆందోళన

● రైతు సంఘం అగ్రనేత చామరస మాలిపాటిల్



మాట్లాడుతున్న చామరస మాలిపాటిల్

రాయచూరు సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాం వల్ల ఎదురవుతున్న సమస్యలపై 8వ తేదీన మునిరాబాద్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్నట్లు కర్ణాటక రైతు సంఘం, హసిరుసేన గౌరవధ్యక్షుడు చామరస మాలి పాటిల్ తెలిపారు. తుంగభద్ర డ్యాం గేట్ల మరమ్మతు, నూతన గేట్ల ఏర్పాటు వంటి పనుల విషయంలో ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యాన్ని రైతులు తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలిపారు. జలాశయానికి సమాంతరంగా నవలి వద్ద చేపట్టే బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణం విషయంలోనూ ప్రభుత్వం స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. తుంగభద్ర జలాశయంలో 30 శాతం మేరకు సిల్టు పేరుకుపోయిన నేపథ్యంలో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయి చివరి ఆయకట్టుకు నీరందడం గగనంగా మారిందన్నారు. ఈ విషయమై ఏళ్ల తరబడి తాము పోరాడుతున్నా ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లేదన్నారు. ఈ ఏడాది జూలై చివరి వారంలో నీటిని దిగువకు విడుదల చేయగా ఆగస్టు చివరి నాటికి సిరవార ప్రాంతానికి వచ్చాయని ఇందుకు కాలువల పైభాగంలో జరుగుతున్న నీటి చౌర్యమే కారణమన్నారు. నీటి చౌర్యాన్ని అరికట్టేందుకు తగిన చట్టం రూపొందించినా అమలు చేయడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లోపించిందన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిర్వహిస్తున్న ఆందోళనలో నాలుగు జిల్లాల రైతులు అన్ని పార్టీల ప్రముఖులు, వ్యాపారవేత్తలు పాల్గొంటారన్నారు. గంగావతి మాజీ ఎమ్మెల్యే గంగాధర్ నాయక్ మాట్లాడుతూ తుంగభద్ర డ్యాం సమస్య కేవలం రైతులకు మాత్రం పరిమితం కాదవని వ్యాపారులు, అన్ని వర్గాల ప్రజలు తమ సమస్యగా భావించి ఆందోళనలో భాగస్వాములు కావాలని కోరారు.

శస్త్రచికిత్స నుంచి ఫిజియోథెరపీ రక్షణ



మాట్లాడుతున్న డాక్టర్ హరీష్

బళ్లారిరూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సకాలంలో ఫిజియోథెరపీ చికిత్స పొందడం వల్ల శస్త్ర చికిత్సల నుంచి మిమ్మల్ని కాపాడవచ్చని డాక్టర్ హరీష్ అన్నారు. గురువారం నగరంలోని డాక్టర్ రాజ్‌కుమార్ రోడ్డులో అనంత వాసుదేవ ఆస్పత్రిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 8వ తేదీన ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా వాసుదేవ ఆస్పత్రిలో ఉచితంగా చికిత్సను ఏర్పాటు చేస్తామని నగర ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నిఖిల్ రావు, డాక్టర్ జయలక్ష్మి నాయకర్, డాక్టర్ రాకేష్ మాణిక్‌రావు, డాక్టర్ నిఖిల్ రావు జూనియర్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి: ఎమ్మెల్యే గణేష్



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు పార్టీలు విడనాడి ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే గణేష్ అన్నారు. గురువారం కంప్లి తాలుకా శ్రీరామరంగాపురం (సుగ్నల్లి కొట్టాల్) గ్రామంలోని సీసీ రోడ్లకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు సదుపాయాను రైతులు, ప్రజలు సద్వినియోగం పరచుకోవాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామన్నారు. గ్రామాల్లో కేవలం ఎన్నికల్లో మాత్రం పార్టీలకు అతీతంగా అభివృద్ధికి ఐక్యతతో ముందుకు రావాలని సూచించారు. శ్రీరామరంగాపురం నుంచి ఏ గ్రామానికి వెళ్లాలన్నా నూతన రోడ్లు ఏర్పాటు చేశామని తెలిపారు. మంజు, నాగభూషణ, వెంకటపతి, రామాంజిని, వెంకటరమణ, రాధాకృష్ణ, జగన్నాథ్, మారుతి, ఎం.మంజు, నాగేష్, విశ్వనాథ్ గ్రామస్థులు, పంచాయతీ సభ్యులు, ప్రముఖులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా పేపర్ బాయ్స్ దినోత్సవం



సంబరాల్లో పేపర్ బాయ్స్

బళ్లారి సిటీ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): నగరంలో ఉదయాన్నే ఇంటికి ప్రపంచ సమాచారాన్ని చేరవేసే పేపర్ బాయ్స్ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. చలి, వర్షాన్ని లెక్కచేయకుండా ఉదయాన్నే ఇంటి ముంగిటకు చేర్చే బాయ్స్‌కు పలువురు ధన్యవాదాలు తెలిపారు. నగరంలోని సీనియర్ పేపర్ బాయ్స్ రవికుమార్, కమ్యూద్దీన్, దివాకర్‌లను నగర ప్రజలు సత్కరించారు. కార్యక్రమంలో ఎర్రిస్వామి, రంగస్వామి, రాజశేఖర్, సతీశ్‌కుమార్, నవీన్, ఆచారి, వీరేశ్, మహమ్మద్ పాల్గొన్నారు.

పాఠశాలల సాధికారత మనందరి బాధ్యత

● టీహెచ్ఎం బసవరాజ్



మాట్లాడుతున్న బసవరాజ్

బళ్లారి సిటీ,సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల సాధికారత మనందరి బాధ్యత అని కల్చరల్ ఆర్ట్స్ ట్రస్ట్ అధ్యక్షుడు టీహెచ్ఎం బసరాజు అన్నారు. తాలూకాలోని హందిహాల్ గ్రామంలో గురువారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పిల్లలకు ఉచితంగా టై, బెల్టులను పంపిణీ చేశారు. ఉపాధ్యాయులకు మంచి జీతాలు, పాఠశాలకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాలు కల్పిస్తే గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల నుంచి ప్రతిభావంతులు బయటకు వస్తారని అన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన కొరలగుంది గ్రూప్ రిసోర్స్ సెంటర్ పర్సన్ ఇన్‌చార్జి రవిచంద్ర కల్చరల్ ఆర్ట్స్ ట్రస్ట్ పనిని ప్రసంశించారు. మరో అతిథి హందిహాల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవిత మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వ పథకాలతో పాటు, దాతల సహకారం అవసరమని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌డీఎంసీ అధ్యక్షుడు వెంకటేశ్, లింగప్ప, సుభాష్ సాబ్, టీచర్ సహిదా అంజుమ్, గీతమ్మ, కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత శివలింగప్పలను హందిహాళ్‌ను కల్చరల్ ఆర్ట్స్ ట్రస్ట్ సభ్యులు సత్కరించారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

సిరుగుప్ప, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కన్నుల పండువగా 9వ రోజు గణేష నిమజ్జన కార్యక్రమం సాగింది. సిరుగుప్ప పట్టణం ఆదోని రోడ్డు మార్గంలో వెలసిన తాయమ్మదేవి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడిని ప్రధాన రహదారుల్లో ఊరేగించి తుంగభద్ర నదిలో నిమజ్జనం చేశారు. వినాయక కళా సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

ఖోఖో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో ఉపాధ్యాయులు, పోలీసులు

కంప్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సిరుగుప్పలో జరిగిన ఖోఖో క్రీడాపోటీల్లో సిరిగేరి గ్రామానికి చెందిన హైస్కూలు విద్యార్థులు రాణించి తాలుకా స్థాయిలో ప్రథమ స్థానం దక్కించుకున్నారు. విద్యార్థులను గ్రామస్థులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా మేరీ మాత జయంతి



హోస్పేట,సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): యేసు తల్లి మేరీమాత జయంతి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కేథలిక్ చిర్చ ప్రాంగణంలో తల్లి ధ్వజారోహణ కార్యక్రమాన్ని గురువు భగవంత్ రాజ్ నిర్వహించారు. క్రైస్తవులు ప్రార్థనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సుందర్ రాజ్ పాల్గొన్నారు.

ధ్వజారోహణ కార్యక్రమం

కుంబరగిరిని మురికివాడగా ప్రకటించాలి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

హోస్పేట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని కుంబరగిరి ప్రాంతాన్ని మురికివాడగా ప్రకటించాలని మున్సిపల్ కమిషనర్ శివకుమార్‌కు గురువారం స్లమ్ పీపుల్స్ ఆర్గనైజేషన్ కర్ణాటక విజయనగర్ జిల్లా యూనిట్ అధ్యక్షుడు హెచ్ శేషు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాంతాన్ని మురికివాడగా ప్రకటించక పోవడంతో నివాసితులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కమిషనర్ స్పందిస్తూ అధికారులు శుక్రవారం మురికివాడను సందర్శిస్తారని, నింబంధనలు ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎన్ వెంకటేష్, కైలాశ్, రాజాబక్షి బరకాటి, మహిళా విభాగం అధ్యక్షురాలు హులిగమ్మ, ఉపాధ్యక్షురాలు నూర్‌జహాన్, ప్రధాన కార్యదర్శి బీసరు పలత, నాయకులు షేక్ మోహబుబ్, బాషా, మాబాషా, కాగి ఉమేష్, కార్తీక్, జబ్రీన్, మునియప్ప, బీటీ పాన్‌డుస్, మంజునాథ్ పాల్గొన్నారు.

పత్రికల్లో వాస్తవాలను రాయాలి



మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ గౌసియాబేగం

సిరుగుప్ప, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పత్రికల్లో వాస్తవాలను రాయాలని తహసీల్దార్ గౌసియా బేగమ్ సూచించారు. గురువారం శిశు అభివృద్ధి యోజన భవనంలో సిరుగుప్ప తాలుకా జర్నలిస్టు సంఘం ఆధ్వర్యంలో తాలుకా స్థాయి విలేకరుల దినోత్సవాన్ని నిర్వహించారు. మొక్కకు నీరుపోసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నేటి రోజుల్లో సమాజమార్పిడిలో పత్రికల పాత్ర ముఖ్యమైనదని ఆమె తెలిపారు. మంచి కథనాలు, వాస్తవాలు మాత్రమే పత్రికల్లో ప్రచురించాలని సూచించారు. జర్నలిస్టులు ప్రభుత్వ సౌకర్యాలు పొంది అభివృద్ధి బాటలో నడవాలని కోరారు. ముస్లిం గురువులు మోహిన్ ఖాద్రి సీనియర్ జర్నలిస్టు హాజీ అబ్దుల్ నబీ, శిశు అభివృద్ధి యోజన సహాయక అధికారి మోహన్, సిరుగుప్ప తాలుకా జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు మహమ్మద్ నౌషాద్ అలీ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉమాదేవి, వైద్యులు డాక్టర్ మహమ్మద్, జర్నలిస్టులు ఇబ్రహీం, రఫీక్, మల్లికార్జున, నాగేష్, గురుస్వామి, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

హోసూరు జోన్

జాన్‌బాస్కో పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం



ఉపాధ్యాయులకు అవార్డులు అందజేస్తున్న దృశ్యం

హోసూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని జాన్‌బాస్కో హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవం గురువారం జరిగింది. ఎమ్మెల్యే ప్రకాశ్, మేయర్ సత్య ముఖ్యులుగా పాల్గొని ఉపాధ్యాయులను సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్టాలిన్ విద్య, ఆరోగ్య శాఖలకు వివిధ పథకాల కింద వెయ్యి కోట్ల రూపాయలు కేటాయించి ప్రోత్సహిస్తున్నారన్నారు. విద్యతోనే పురోగతి సాధ్యమని, ఆరోగ్యకరమైన సమాజంకోసం ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. భావితరాలను రూపొందిస్తున్న ఉపాధ్యాయులపై ఎంతో గురుతర బాధ్యత ఉందన్నారు. విద్యార్థులు కూడా మంచి ప్రయోజకులు కావాలని అభిలషించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



విశేష పూజల్లో పాల్గొన్న భక్తులు

హోసూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని విఘ్నేశ్‌నగర్‌లోని ఉమామహేశ్వర ఆలయం వార్షికోత్సవం ఘనంగా జరిగింది. గురువారం గణపతి పూజ, 108 కళశాల పూజ, మహాసంకటహర గణపతి హోమం, మహాలక్ష్మి హోమం ఇతర ధార్మిక కార్యక్రమాలు కొనసాగాయి. మధ్యాహ్నం మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కుముతేపల్లి, గాంధీనగర్, పేరండపల్లి, బత్తలపల్లి తదితర ప్రాంతాల వారు ఉత్సవంలో పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ మరమ్మతులు పూర్తి



మిఠాయిలు పంపిణీ చేస్తున్న ఎంపీ గోపీనాథ్

హోసూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): హోసూరు బస్టాండ్ ఎదురుగా ఉన్న చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి మార్గంలోని ఫ్లై ఓవర్ మరమ్మతు పనులు పూర్తయ్యాయి. గురువారం నుంచి వాహనాల సంచారానికి అనుమతించడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు. ఎంపీ గోపీనాథ్ స్వయంగా వాహనదారులకు మిఠాయిలు పంపిణీ చేశారు. జూన్ 21న ఫ్లై ఓవర్‌లో సాంకేతిక సమస్య తలెత్తినట్లు గుర్తించి వాహన సంచారాన్ని మళ్లించిన సంగతి విదితమే. అవసరమైన బేరింగ్‌లు సిద్ధం చేయించడానికి నెలకుపైగా సమయం పట్టింది. ఇలా రెండున్నర నెలల తర్వాత ఫ్లై ఓవర్ మరమ్మతు పనులు పూర్తి అయ్యాయి. ఎంపీ మీడియాతో మాట్లాడుతూ 20 ఏళ్లక్రితం నిర్మించిన ఫ్లై ఓవర్‌లో చిన్నాచితకా సమస్యలు సహజమని, మరమ్మతులకే జాప్యం జరిగిందన్నారు.

ఈద్-మిలాద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలి

●జిల్లా ఎస్పీ పుట్ట మాదయ్య



శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ పుట్టమాదయ్య

రాయచూరు సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మహ్మద్ ప్రవక్త జన్మదినం ఈద్-మిలాద్(మిలాద్ ఉన్ నబీ) వేడుకలను శాంతియుత, సుహృద్భావ వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ పుట్టమాదయ్య సూచించారు. గురువారం ఎస్పీ కార్యాలయం వద్ద ముస్లిం మత పెద్దలు, ప్రముఖులతో శాంతి సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ వేడుకల సందర్భంగా నిర్వహించే ర్యాలీ, ఊరేగింపు వంటివి పోలీసుల అనుమతితో సాగాలన్నారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. మతపరమైన కార్యక్రమాలు పండుగలు, పర్వదినాల సందర్భంగా జరుపుకునే వేడుకలు చట్టం విధించే నిబంధనలకు లోబడి జరగాలన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

ఓనం పండుగ



కేరళ రాష్ట్ర సంస్కృతి, సాంప్రదాయాలతో ముడిపడిన విశిష్టమైన వ్యవసాయ పండుగ ఓనం. కేరళ రాష్ట్ర అధికారిక పండుగ. ప్రజలు పదిరోజులపాటు పండుగను ఆచరిస్తారు. ఓనం. మలయాళీలకు అత్యంత ప్రీతికరమైనది. ప్రధాన ఘట్టం ఈనెల 5న ఉంటుంది. ఇళ్ల ముంగిన రంగవల్లులు, అలంకరణలు చేసి నూతన వస్త్రాలు ధరించి విందుభోజనాలు ఆహ్లాదకరంగా జరుపుకొంటారు. ఆంధ్రప్రదేశ్‌లో సంక్రాంతి, తెలంగాణలో బతుకమ్మ పండుగల తరహాలో కేరళవాసులకు ఓనం ప్రత్యేకమైనది. విష్ణుమూర్తి వరం కారణంగా బలి చక్రవర్తి తన ప్రజలను చూసేందుకు ఆత్మరూపంలో భూమిపైకి వస్తాడని కేరళీయుల ప్రగాఢ నమ్మకం.

సర్వేపల్లి రాధాకృష్ణన్ (జయంతి)



భారతరత్న గ్రహీత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 1888 సెప్టెంబరు 5న తమిళనాడు రాష్ట్రం తిరుత్తణిలో జన్మించారు. భారతదేశ తొలి ఉపరాష్ట్రపతి, రెండో రాష్ట్రపతిగా వ్యవహరించారు. అత్యంత క్లిష్టసమయాల్లో ప్రధానమంత్రులకు మార్గదర్శకం చేశారు. ప్రొఫెసర్‌గానే కాక వైస్‌చాన్స్‌లర్‌గా కూడా వ్యవహరించారు. రష్యాలో భారత రాయబారిగా వ్యవహరించారు. ఆయన రచించిన 'ఇండియన్ ఫిలాసఫీ' అనే పుస్తకం ప్రపంచవ్యాప్తంగా పేరొందింది. యూనివర్సిటీ ఎడ్యుకేషన్ కమిషన్‌లో సభ్యుడిగా విద్యావ్యవస్థ అభివృద్ధికి విలువైన సలహా, సూచనలు చేశారు. ఆయన పుట్టినరోజును ఉపాధ్యాయ దినోత్సవంగా ఆచరిస్తున్నారు. 1975 ఏప్రిల్ 17న కన్నుమూశారు.

మదర్ థెరీసా (వర్ధంతి)



మానవత్వానికి మారుపేరుగా నిలిచిన మదర్ థెరీసా 1910 ఆగస్టు 26న ప్రస్తుత ఉత్తర మెసిడోనియాలోని స్కోప్జే ప్రాంతంలో జన్మించారు. అసలు పేరు ఆగ్నస్ గోక్షా బొజాక్షు. అల్బేనియా దేశానికి చెందిన రోమన్ కేథలిక్ సన్యాసిని. మిషనరీస్ ఆఫ్ చారిటీని స్థాపించి 1950లో స్థాపించి 45ఏళ్లపాటు నిర్వహించి భారతదేశంలోనే కాక ప్రపంచవ్యాప్తంగా పేదలకు, రోగగ్రస్తులకు, అనాథలకూ, మరణశయ్యపై ఉన్నవారికి పరిచర్యలు చేశారు. 1979లో నోబెల్ శాంతి పురస్కారం, 1980లో అత్యున్నత భారతరత్న పురస్కారం, ఇతర అవార్డులు అందుకున్నారు. 1997 సెప్టెంబరు 5న కన్నుమూశారు. 2010లో ఆమె శతజయంతిని పురస్కరించుకుని ఆమె గౌరవార్థం 5 రూపాయల ప్రత్యేక నాణెంను విడుదల చేశారు.

రెంటాల గోపాలకృష్ణ (జయంతి)



ఆధునిక తెలుగు సాహితీరంగంలో అనవరత కృషీవలుడిగా అక్షర షష్టిపూర్తి జరుపుకొన్న అరుదైన రచయిత రెంటాల గోపాలకృష్ణ 1920 సెప్టెంబరు 5న గుంటూరు జిల్లా రెంటాలలో జన్మించారు. పత్రికా రచయితగా, కవి, అనువాదకులు, నాటక కర్త, విమర్శకుడిగా, వక్తగా పేరొందారు. ప్రజానాట్యమండలి కళాకారుడిగా పలు నాటకాలు రాశారు. సుమారు 200 పుస్తకాలు రచించగా 150కుపైగా పదే పదే ముద్రితం కావడం విశేషం. 1995 జూలై 18న కన్నుమూశారు.

బీకేఎస్ వర్మ (జయంతి)



డాక్టర్ బీకేఎస్ వర్మ 1949 సెప్టెంబరు 5న బెంగళూరులో జన్మించారు. ప్రముఖ చిత్రకారుడిగా రాణించారు. ఎక్కువగా పర్యావరణం, సాంఘిక సమస్యలపై ఆయన బొమ్మలు గీశారు. దేవతల బొమ్మలకు సరికొత్త రూపం కల్పించారు. విశ్వకన్నడ సమ్మేళనంలో భాగంగా కావ్యచిత్ర పేరిట ప్రదర్శనలు నిర్వహించారు. కర్ణాటక రాజ్య పురస్కార, రాష్ట్ర లలిత కళా అకాడమీ అవార్డు, రాజ్యోత్సవ అవార్డు, గౌరవ డాక్టరేట్ సహా పలు పురస్కారాలు అందుకున్నారు. 2023 ఫిబ్రవరి 6న కన్నుమూశారు.

టీఎన్ శేషగోపాలన్ (పుట్టినరోజు)



'పద్మభూషణ్' గ్రహీత మధురై తిరుమలై నంబి శేషగోపాలన్ 1948 సెప్టెంబరు 5న తమిళనాడు రాష్ట్రం నాగపట్నంలో జన్మించారు. కర్ణాటక గాత్ర విద్వాంసులు, స్వరకర్తగాను పేరొందారు. ప్రత్యేకించి వీణ, హార్మోనియం వాదనలో సిద్ధహస్తులు. హరికథా కళాకారుడు. సంగీత కళా శిఖామణి, సంగీత కళానిధి, గాయక శిఖామణి, కళైమామణి, హరికథా చూడామణి తదితర పురస్కారాలు అందుకున్నారు.

డీసీసీ చైర్మన్‌గా రాజణ్ణ ఏకగ్రీవం



రాజణ్ణను అభినందిస్తున్న డీసీసీ బ్యాంకు డైరెక్టర్లు

బెంగళూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సహకార శాఖా మంత్రి పదవి కోల్పోయిన రాజణ్ణ తుమకూరు డీసీసీ బ్యాంక్ చైర్మన్ హోదాను మరోసారి దక్కించుకున్నారు. రాజణ్ణ వరుసగా ఏడోసారి బ్యాంకు చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. గురువారం డీసీసీ బ్యాంకు చైర్మన్ స్థానానికి ఎన్నికలు జరిగాయి. రాజణ్ణ ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా గెలుపు సాధించినట్లు సహకారశాఖాధికారులు ప్రకటించారు. డీసీసీ బ్యాంకు పరిధిలో 14 డైరెక్టర్ స్థానాలు ఉండగా ఎనిమిది స్థానాలకు ఎన్నికలు లేకుండా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. తిపటూరు తాలూకా నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యే షడాక్షరి, పావగడ తాలూకా నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యే వెంకటేషలు డైరెక్టర్‌లుగా ఎన్నికయ్యారు. గుబ్బి, కుణిగల్ స్థానాల నుంచి ఎమ్మెల్యేల మద్దతుదారులు ఓటమి చెందారు. ఎన్నికల ప్రక్రియ ఆరంభంలో పోటీ ఉంటుందని రాజణ్ణకు చైర్మన్ స్థానం నుంచి తప్పించాలని ప్రయత్నాలు సాగాయి. కానీ ఆయన మద్దతుదారులే ఎక్కువ మంది డైరెక్టర్‌లు కావడంతో రాజణ్ణ సులభతరంగా చైర్మన్ అయ్యారు. ఏడోసారి రాజణ్ణ తుమకూరు డీసీసీ బ్యాంకు చైర్మన్‌గా కొనసాగనున్నారు.

మైసూరులో రెండు తలల మేకపిల్ల జననం



వింతమేక పిల్ల

బెంగళూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మైసూరు జిల్లా నంజనగూడు తాలూకా కురహట్టి గ్రామంలో రెండుతలలమేక పిల్ల జన్మించింది. గ్రామానికి చెందిన రవీష్ అనే రైతు పెంచుకుంటున్న మేకలు పెంచుకునేవారు. అందులో ఓ మేక రెండు పిల్లలకు జన్మనిచ్చింది. అందులో ఓమేక పిల్లకు రెండు తలలు, నాలుగు కళ్ళు, రెండు చెవులు, రెండు నోర్లు కాగా మిగిలిన శరీర భాగాలు యథావిధంగానే ఉన్నాయి. విచిత్రంగా జన్మించినా మేక పిల్ల మాత్రం సాధారణంగానే ఉన్నట్లు రైతు రవీష్ తెలిపారు. వింత మేక పిల్లను చూసేందుకు గ్రామానికి చెందినవారితో పాటు సమీప పల్లెల వాసులు పెద్ద ఎత్తున వస్తున్నారన్నారు. కొన్నేళ్ళకాలంగా మేం మేకలను పెంచుకుంటున్నామని ఇటువంటి విచిత్రమైన మేక పిల్ల జన్మించడం ఇదే తొలిసారి అన్నారు. పలు ప్రాంతాలలో వింత మేక, గొర్రె, ఆవుదూడలు జన్మిస్థాయిన విన్నామని తొలిసారి చూస్తున్నట్లు తెలిపారు. మేక పిల్ల ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు.



వీరభద్ర, వినాయక స్వామి



అర్ధనారీశ్వరుని రూపంలో..



పార్వతి ఒడిలో బొజ్జగణపయ్య



వినాయకా.. వీడ్కోలిక..!

- హిందూపురంలో గణేశ్ నిమజ్జనం
- రాత్రి 9 గంటల దాకా 35 విగ్రహాలే
- నేడే అతిపెద్ద విగ్రహాల నిమజ్జనం

హిందూపురం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. గణేష్ విగ్రహాలు గురువారం మధ్యాహ్నం నుంచి గుడ్డం కోనేరు వద్ద నిమజ్జనానికి క్యూకట్టాయి. భక్తులు రంగులు చల్లుకుంటూ కులమతాలకు అతీతంగా నృత్యాలు చేస్తూ లంబోధరుడి ఊరేగింపులో ముందుకు సాగారు. భక్తి పారవశ్యంతో జైభోలో గణేష్ మహరాజకి జై అంటూ నినాదాలు చేశారు. మళ్లీ రావయ్యా గణేశా అంటూ విగ్రహాలను కోనేరుకి తరలించారు. చిన్నా పెద్దా తేడా లేకుండా వంద దాకా డీజేలు ఏర్పాటుచేసుకున్నారు. పట్టణంలో సూగూరు ఆంజనేయస్వామి సర్కిల్ నుంచి గురునాథ్ సర్కిల్ వరకు శ్రీకంఠపురం నుంచి పరిగి రోడ్డులోని కట్టుకాలువ వరకు విగ్రహాలు ఊరేగింపుగా ముందుకు సాగాయి. కోలాహలంగా కార్యక్రమం కొనసాగింది. పలు విగ్రహాల వద్ద లడ్డూలు వేలం పాట నిర్వహించారు. రాత్రి 9 గంటల వరకు చిన్న చిన్న విగ్రహాలు 35 మాత్రమే నిమజ్జనమయ్యాయి. ఇంకా 160కి పైగా విగ్రహాలు నిమజ్జనం కావాల్సి ఉంది. అయితే రాత్రి 12 గంటల వరకు మహా అయితే 60 నుంచి 70 వరకు నిమజ్జనం కావచ్చు. ఒక్కో విగ్రహం నిమజ్జనం కావడానికి పది నుంచి పదేహేను నిమిషాల సమయం పడుతోంది. రాత్రంతా రెండు క్రేన్లతో నిమజ్జనం చేసినా శుక్రవారం వరకు కొనసాగుతుంది.

ఎప్పటిలాగే నిమజ్జనం ఆలస్యం

ఈసారి కూడా వినాయక ప్రతిమలు మంటపాల నుంచి ఆలస్యంగానే ముందుకు కదిలాయి. అయితే ఉదయమే కదిలిన విగ్రహాలు రోడ్డెక్కి ముందుకు కదలకుండా ఆపేశారు. డీజేలు ఉండటం వలన ప్రతి విగ్రహం సాయంత్రం తరువాతే ముందుకు సాగింది. రాత్రి 9 గంటల సమయంలో కూడా శ్రీకంఠపురం సర్కిల్ నుంచి బాబా గుడి ఆర్చి వరకు ఉన్నాయి.

పెద్ద విగ్రహాలు నేడు నిమజ్జనం

హిందూపురంలో ఏర్పాటుచేసిన పెద్ద విగ్రహాలు శుక్రవారం నిమజ్జనం జరగనున్నాయి. అవి పట్టణం చుట్టేసుకొని గుడ్డం చేరుకునే సమయానికి తెల్లారుతుంది. దీంతో ఆ విగ్రహాల నిమజ్జనం శుక్రవారం రోజే జరుగునట్లుగా కనిపిస్తోంది.

పూజల్లో పాల్గొన్న టీడీపీ నాయకులు

వినాయక నిమజ్జనం సందర్భంగా మున్సిఫల్ చైర్మన్ రమేష్, ఎమ్మెల్యే పిఏ బాలాజీ, పట్టణ కన్వీనర్ వెంకటేష్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఆనంద్, నాయకులు మంగేష్, చంద్రమోహన్, మంజునాథ్, పవన్, అంజి, అమరనాథ్, కౌన్సిలర్లు, నాయకులు పూజల్లో పాల్గొన్నారు. గుడ్డం వద్ద పలు విగ్రహాలకు పూజలు నిర్వహించి నిమజ్జనం చేశారు.

భద్రత కట్టుదిట్టం



భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న ఎస్పీ రత్న

గతంలో జరిగిన కొన్ని సంఘటనల నేపథ్యంలో ఈసారి పోలీసులు కట్టుదిట్టమైన భద్రతను చేపట్టారు. పలు సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెట్టగా, కొన్ని విగ్రహాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు. ఎస్పీ రత్న, డీఎస్పీలు మహేష్, మహబూబ్‌బాషా, ఆదినారాయణ తదితరలతో పాటు పోలీసులు విగ్రహాలను ముందుకు కదలించారు. ఎస్పీ పోలీస్ కమాండ్ కంట్రోల్ రూంలో కూర్చొని విగ్రహాల నిమజ్జనాన్ని వీక్షించారు. అనంతరం ఆమె పలు ప్రాంతాల్లో నడుచుకుంటూ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.



నిమజ్జనానికి తరలుతున్న భారీ వినాయకులు



రామలక్ష్మణులను భుజాలపై ఎత్తుకున్న గణేశుడు



ఊరేగింపుగా వెళుతున్న గణపతి



డీజే ముందు చిందులేస్తున్న యువతీ యువకులు



మూడు పడగల గణపతి

కాల్చేసిన బీడీ

బెంగళూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): తాగి పడేసిన బీడీ వృద్ధుడిని బలిగొంది. మైసూరునగరం మండి మొహల్లా సర్ ఖాజీ రోడ్‌లోని గుజరీ వ్యాపారి సిద్దనాయ్క(60) బీడీ తాగి ఆర్పేయకుండానే ఇంట్లో పడేయడంతో అగ్ని రాజుకుని సజీవదహనమయ్యారు. బుధవారం ఉదయం సిద్దనాయ్క కుటుంబసభ్యులలో భార్య సిద్దమ్మ కూలీ పనులకు వెళ్ళగా మనవరాలు కళాశాలకు వెళ్ళారు. ఇంట్లో ఒంటరిగా ఉండే సిద్దనాయ్క బీడీ తాగి నిప్పు ఆర్పకుండానే విసిరారు. పాతవస్తువుల మధ్యన పడిన బీడీ ముక్క నుంచి అగ్గిరాజుకుంది. ఇంట్లోనే నిద్రిస్తుండగా పొగమంటలు అలుముకున్నాయి. మంటల నుంచి బయటపడేందుకు సాధ్యం కాలేదు. దీంతో ఇంట్లోనే సిద్దనాయ్క సజీవ దహనమయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్‌లతో వచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అయినా ఫలితం లేకుండా పోయింది. మంటలు ఆర్పాక పరిశీలించగా సిద్దనాయ్క పూర్తిగా కాలిపోయి సజీవదహనమయ్యారు. మండి పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం తర్వాత మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. చిన్న అగ్గి ఇంతటి దారుణానికి కారణమయ్యిందని పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అగ్నిప్రమాదాలపై నిర్లక్ష్యం చేయరాదని అధికారులు ఈ సందర్భంగా స్థానికులకు సూచించారు.

కేఆర్ మార్కెట్‌తో సంబంధం లేదు

- విదేశాలకు పూలు ఎగుమతి చేయడానికే జీకేవీకేలో నిర్మాణం: అసోసియేషన్ అధ్యక్షుడు అరవింద్



మాట్లాడుతున్న అరవింద్

బెంగళూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): హెబ్బాళ జాతీయ రహదారికి అనుబంధంగా జీకేవీకేలో నిర్మించతలపెట్టిన పూలమార్కెట్‌కు కేఆర్ మార్కెట్‌లోని పూలమండీలకు ఎటువంటి సంబంధం లేదని దక్షిణభారత ఫ్లవర్ అసోసియేషన్ అధ్యక్షుడు అరవింద్ తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడిన ఆయన జీకేవీకేలో మార్కెట్ నిర్మాణాలకు 900 చెట్లు కొట్టివేస్తారనడం తప్పుడు ప్రచారమన్నారు. జీకేవీకేలో నిర్మించేది విదేశాలకు ఎగుమతి చేసే కట్‌ఫ్లవర్ మార్కెట్ అన్నారు. చెట్లను సంరక్షించుకునే నిర్మాణాలు జరుగుతాయన్నారు. ప్రభుత్వం వందకోట్లు విడుదల చేసిందన్నారు. ప్రపంచ దేశాలకు బెంగళూరు నుంచి ఎగుమతి చేసే పూలు మహత్తరమైనవన్నారు జీకేవీకేలో మార్కెట్ నిర్మాణం కోసమే ఐదు ఎకరాల భూమి కేటాయించిందన్నారు. కేఆర్ మార్కెట్‌లో విడిపూల వ్యాపారాలు సాగుతాయన్నారు. కేఆర్ మార్కెట్ వ్యాపారులకు దీంతో ఎటువంటి నష్టం ఉండదని అక్కడే మార్కెట్ సాగనుందన్నారు. సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి పీజీ రాజు తదితరులు పాల్గొన్నారు.

'సైనికుల సేవలు వెలకట్టలేనివి'

రాయచూరు సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): దేశ భద్రత కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన సైనికుల సేవలు వెలకట్టలేనివని మహానగర పాలికె చైర్‌పర్సన్ నరసమ్మ అన్నారు. మాజీ సైనిక సంఘం కార్యాలయాన్ని గురువారం పాత నగరసభ కార్యాలయంలో ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఉప కమిషనర్ లలితా రాణి, మహానగర పాలిక నిబంధనల మేరకు మాజీ సైనికుల సంఘం కార్యాలయానికి కంప్యూటర్ ఇతర పరికరాలు ఇచ్చేందుకు అంగీకరించకపోతే తాము నెల జీతాన్ని విరాళంగా అందచేస్తానని హామీ ఇచ్చారు.


అనుమానిత మావోయిస్టు అరెస్ట్

రాయచూరు సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): నగర సమీపంలోని యరమరస్ వద్ద ఒక రైస్‌మిల్లులో కార్మికుడిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు అయిన కార్మికుడు బిహార్‌కు చెందిన వాడు కాగా అతడు మావోయిస్టు కార్యకలాపాల్లో ఉండి 18 కేసుల్లో ముద్దాయిగా ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. మనోజ్ సదా అనే ఈ కార్మికుడు రెండేళ్లుగా ఇక్కడే మకాం వేసి వివిధ ఫ్యాక్టరీలల్లో పని చేస్తూ కాలం గడుపుతున్నాడు. బిహార్ పోలీసులు అతని కోసం గాలిస్తు ఇక్కడున్నట్లు సమాచారం రావడంతో రెండు రోజుల క్రితం జిల్లా కేంద్రానికి చేరుకుని రూరల్ పోలీసుల సహాయంతో అరెస్టు చేశారు. కాగా బిహార్‌కు చెందిన కార్మికుడొకరు నక్సల్ కార్యాకలాపాల్లో ఉంటూ కేసుల నుంచి తప్పించుకునేందుకు ఇక్కడికి వచ్చాడన్న వార్త ఒక్క సారిగా జిల్లా అంతటా పాకడంతో ఫ్యాక్టరీల యజమానులు ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలో ముఖ్యంగా రాయచూరు పరిసరాల్లో ఉన్న వందలాది రైస్ మిల్లులు, జిన్నింగ్ మిల్లులు, దాల్ మిల్లు ల్లో బిహార్, యూపీ, ఛత్తీస్‌గడ్ ఇతర రాష్ట్రాలకు చెందిన వలస కూలీలే ఎక్కువగా ఉండడం గమనార్హ. ఈ క్రమంలో వేరే రాష్ట్రానికి చెందిన కార్మికుడి పై పోలీసుల కేసు ఉండడంతో ఫ్యాక్టరి యజమానులు సైతం ఈ కేసు తమ మెడకు ఎక్కడ చుట్టుకుంటుందోనని ఆందోళనకు గురవుతున్నారు. స్థానిక కార్మికులు సమయాకూలంగా పని చేయడం లేదని తరచూ పనులకు ఎగనామం పెడుతున్నారని భావిస్తున్న అనేక మంది ఫ్యాక్టరీల యజమానులు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులకు ఇక్కడే గుడిసెలు వేయించి వారిని ఫ్యాక్టరిల చెంతనే నివాసముండేలా ఏర్పాట్లు చేసుకున్నారు.

ఈ క్రమంలో ఇప్పుడు బిహార్‌కు చెందిన వలస కూలి పై పోలీసు కేసు నమొదు కావడం సర్వత్రా చర్చనీయాంశమైంది. గతంలో మావోయిస్టు కార్యకలాపాలు జోరుగా సాగిన ఉదంతాలుండగా మొట్టమొదట సారి రాయచూరు జిల్లాలోనే నక్సల్స్ కార్యకలాపాలున్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ క్రమంలో బిహార్ నుంచి వచ్చిన కార్మికుడు నిజంగా కేసు నుంచి తప్పించుకునేందుకు వచ్చాడా? లేకా ఇంక ఏదైనా నేర చరిత్ర ఉందా అనేది తేలాల్సి ఉంది.

కన్నతండ్రే కాలయముడు

ముగ్గురు పిల్లలను చంపి తానూ ఆత్మహత్య



హత్యకు గురైన మోక్షిత, వర్షిణి, శివధర్మ (ఫైల్)

ఎర్రగొండపాలెం రూరల్, నాగర్‌కర్నూల్/వెల్దండ/ఉప్పునుంతల/కల్వకుర్తి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కన్న బంధం మాటున క్రూరత్వం దాగుందని తెలియదా ముక్కుపచ్చలారని పిల్లలకు! వేలు పట్టి నడిపించే నాన్నే కాలయముడు అవుతాడని ఊహించి ఉండరు ఆ చిన్నారులు! ఓ తండ్రి పేగుబంధాన్ని మరిచి తన ముగ్గురు పిల్లలనూ పాశవికంగా చంపిన దారుణ ఘటన నాగర్‌కర్నూలు జిల్లాలో వెలుగుచూసింది. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం పెద్దబోయపల్లికి చెందిన గుత్త వెంకటేశ్వర్లు(38) మేనమరదలు దీపికను 12ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వారికి కుమార్తెలు మోక్షిత (8), వర్షిణి (6), కుమారుడు శివధర్మ (4) ఉన్నారు. భార్యతో గొడవపడిన వెంకటేశ్వర్లు గత నెల 30న ముగ్గురు పిల్లలను బైక్‌పై ఎక్కించుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో దీపిక తన భర్త, పిల్లలు అదృశ్యమయ్యారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టగా వెంకటేశ్వర్లు 31న శ్రీశైలం మీదుగా నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట సమీపంలోని హాజీపూర్ చౌరస్తా వరకు వచ్చినట్లు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించారు. ఆ క్రమంలో పిల్లలు ఒక్కొక్కరుగా తండ్రితో పాటు బైక్‌పై కనిపించకపోవడం ఆందోళన రేకెత్తించింది. పోలీసులు వెల్దండ మండలం పెద్దాపూర్ దగ్గర వెంకటేశ్వర్లు మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. అతడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పిల్లల జాడ కోసం సీసీటీవీ ఫుటేజ్‌ల ఆధారంగా జల్లెడ పట్టారు. చారకొండ మండలం జూపల్లి వచ్చేసరికి వెంకటేశ్వర్లుతో పెద్దకూతురు మోక్షిత ఒక్కతే ఉంది. ఆ తర్వాత వెంకటేశ్వర్లు ఒంటరిగా కల్వకుర్తి పట్టణానికి చేరుకున్నాడని నిర్ధారణకు వచ్చారు. దాంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి జాతీయ రహదారికి ఇరువైపులా గాలించారు. గురువారం మధ్యాహ్నం ఉప్పునుంతల మండలం సూరాపూర్ తండా వద్ద వర్షిణి, శివధర్మల మృతదేహాలు, కల్వకుర్తి మండలం తాండ్ర సమీపంలో మోక్షిత మృతదేహం పూర్తిగా కాలిపోయిన స్థితిలో లభ్యమయ్యాయి. వెంకటేశ్వర్లు ఒక్కోచోట పిల్లలను హతమారుస్తూ వచ్చినట్లు తేలింది. పురుగులమందు తాగించి చంపి, తర్వాత పెట్రోల్ పోసి దహనం చేశాడని భావిస్తున్నారు. వెల్దండ, ఉప్పునుంతల, కల్వకుర్తి మండలాల పోలీసులు పూర్తిస్థాయి విచారణ ప్రారంభించారు. ప్రకాశం జిల్లా నుంచి ప్రత్యేక పోలీసు బృందం అచ్చంపేట చేరుకుంది.

ఏబీసీ చైర్మన్‌గా కరుణేష్ బజాజ్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్ (ఏబీసీ) చైర్మన్‌గా ఐటీసీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్, ఎక్స్‌పోర్ట్స్) కరుణేష్ బజాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏడాది పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. పాతికేళ్లకు పైగా ఐటీసీలో వివిధ హోదాల్లో పనిచేశారు. పలు బ్రాండ్లు దేశవ్యాప్తంగా విస్తృత గుర్తింపు పొందడంలో ఆయన కృషి ఉంది. ఐటీసీ కంటే ముందు భారతీ రిటైల్ లిమిటెడ్ (భారతీ-వాల్‌మార్ట్ జేవీ)లో హెడ్ ఆఫ్ బ్రాండ్స్‌గా పనిచేశారు. ఏబీసీ డిప్యూటీ చైర్మన్‌గా బెన్నెట్ అండ్ కోల్‌మన్ కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మోహిత్ జైన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

8 ఏళ్ల తర్వాత తప్పు దిద్దుకున్నారు: ఖర్గే

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: 'ఒకే దేశం ఒకే పన్ను' పేరిట ఇప్పటి వరకూ 'ఒకే దేశం 9 పన్నుల' విధానాన్ని అమలు చేశారని, ఎనిమిదేళ్ల తర్వాత తప్పును గ్రహించి సరిదిద్దుకునే ప్రయత్నం చేశారని కేంద్రం తీసుకొచ్చిన జీఎస్టీ మార్పులపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ఎక్స్‌లో ఈ మేరకు స్పందించారు. రైతుల మీద కూడా (36 రకాల వ్యవసాయ ఉపకరణాలపై) పన్ను వేశారని, మొత్తం జీఎస్టీ రాబడిలో 64% పేదలు, మధ్యతరగతి ప్రజల నుంచి వస్తోందని తెలిపారు. మోదీ సర్కారు కార్పొరేట్ ట్యాక్స్‌ను 30 నుంచి 22 శాతానికి తగ్గించి సంపన్నులకు మరింత లబ్ధి చేకూర్చిందని ఖర్గే దుయ్యబట్టారు. జీఎస్టీ సరళీకరణ, శ్లాబుల తగ్గింపు మంచి నిర్ణయమని, అయితే, దీనికి 8 ఏళ్లు ఎందుకు పట్టిందని మాజీ ఆర్థికమంత్రి చిదంబరం ప్రశ్నించారు.

లబ్ధిని వినియోగదారులకు అందించండి

» జీఎస్టీ తగ్గింపుపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు అందించాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ పరిశ్రమ వర్గాలకు పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇదే అతిపెద్ద పన్ను సంస్కరణ అని, దీన్ని 'గేమ్ చేంజర్'గా అభివర్ణించారు. 2047 కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడంలో ఈ సంస్కరణలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. దాదాపు అన్ని రంగాల్లో డిమాండ్ పెరుగుతుందని, ఫలితంగా పెట్టుబడులు పెరుగుతాయని, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. స్వదేశీ వస్తువుల విక్రయాలను భారీగా ప్రోత్సహించాలని పరిశ్రమ వర్గాలను కోరారు. గురువారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఆ మంత్రులపై క్రిమినల్ కేసులు

కేంద్రమంత్రుల్లో 40% మంది వీరే.. రాష్ట్రాల్లో 47%మందిపై నేరాభియోగాలు

- కొందరిపై హత్య, హత్యాయత్నం వంటి తీవ్రమైన క్రిమినల్ ఆరోపణలు
- ఏపీ కేబినెట్‌లోని 25 మందిలో 22 మందిపై కేసులు
- తెలంగాణలోని 15మంది మంత్రుల్లో 11 మందిపైనా..
- తొలి పది మంది బిలియనీర్లలో ఆరుగురు తెలుగువాళ్లే
- సంపన్నుల జాబితాలో చంద్రబాబు, లోకేశ్ 3, 7 స్థానాల్లో: ఏడీఆర్ నివేదిక



ఆస్తులు, అప్పుల్లో పెమ్మసాని టాప్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రివర్గంలోని 72 మందిలో 40శాతం మంత్రులపైనా, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 643 మంది మంత్రుల్లో 47 శాతం మంది మంత్రులపైనా క్రిమినల్ కేసులు ఉన్నాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంస్థ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గ సభ్యులతోపాటు దేశంలో 27 రాష్ట్ర అసెంబ్లీలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల మంత్రుల నేపథ్యాన్ని వారు సమర్పించిన అఫిడవిట్ల ద్వారా ఏడీఆర్ సేకరించింది. గురువారం ఆ వివరాలను వెల్లడించింది. వీరిలో 47 శాతం మంది తనపై క్రిమినల్ కేసులు ఉన్నట్టు పేర్కొన్నారని తెలిపింది. ఏపీ అసెంబ్లీలో 25 మంది మంత్రులు ఉండగా, 22 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపింది. వారిలోనూ 14 మందిపై తీవ్రమైన కేసులు ఉన్నాయని తేల్చింది. తెలంగాణలో కూడా 15 మంది మంత్రుల్లో 11 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, వారిలో ఆరుగురిపై తీవ్రమైన క్రిమినల్ నేర ఆరోపణలు ఉన్నాయని ఏడీఆర్ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గంలో పార్లమెంట్ ఉభయ సభలకు చెందిన 72 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 29 మంది క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. 19 మంది మంత్రులపై అత్యంత తీవ్రమైన నేర అభియోగాలు ఉన్నాయి. రాష్ట్రాల అసెంబ్లీల్లో 643 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 302 మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నాయని వెల్లడించారు. వీరిలో 174 మంది మంత్రులు హత్య, హత్యాయత్నం, అపహరణ, మహిళలపై నేరాలు వంటి అత్యంత తీవ్రమైన క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు.

పార్టీలవారీగా..

రాష్ట్రాల్లో బీజేపీకి చెందిన 336 మంది మంత్రుల్లో 136 మందిపై, కాంగ్రెస్ కు చెందిన 61 మంది మంత్రుల్లో 13 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 40 మంది మంత్రుల్లో 13 మందిపై, ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 16 మందిలో 11 మందిపై, సీపీఎంకు చెందిన పది మంది మంత్రుల్లో ఆరుగురిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి.


ఆస్తుల లెక్కలు..

రాష్ట్రాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న మొత్తం మంత్రుల ఆస్తుల విలువ రూ.23,929 కోట్లు. కేంద్ర, రాష్ట్రాల్లో కలిపి చూస్తే మొత్తం 36 మంది మంత్రులు ఒక్కొక్కరి ఆస్తి రూ.100 కోట్లకు పైగానే ఉంటుంది. సగటున కేంద్ర, రాష్ట్ర మంత్రుల ఆస్తి విలువ రూ.37.21 కోట్లు. 30 రాష్ట్ర అసెంబ్లీల్లో 11 అసెంబ్లీల్లో వందకోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కర్ణాటకలో అత్యధికంగా ఎనిమిది మంది మంత్రులు రూ.100 కోట్లకు పైగా ఆస్తులను సమీకరించారు. ఆ తర్వాతి స్థానం ఏపీ, మహారాష్ట్రలకు దక్కుతుంది. ఆంధ్రప్రదేశ్ మంత్రుల్లో ఆరుగురి ఆస్తులు రూ.100 కోట్లకు పైనే. తెలంగాణ మంత్రుల్లో ఇద్దరు మాత్రమే రూ.100 కోట్లకు పైగా ఆస్తులు కలిగి ఉన్నారని తెలిపింది.

టాప్‌లో బీజేపీ..

పార్టీల వారీగా చూస్తే బీజేపీలోనే అత్యధికంగా 14 మంది రూ.100 కోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కాంగ్రెస్ లో 61 మంది మంత్రుల్లో 11 మంది బిలియనీర్లు. మూడోస్థానం తెలుగుదేశం పార్టీది. కేంద్ర, రాష్ట్ర మంత్రుల వారీగా చూస్తే దేశంలో అత్యధిక ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో గుంటూరు పార్లమెంట్ సభ్యుడు, పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన ఆస్తుల విలువ రూ.5,705 కోట్లు. ఆ తర్వాత స్థానంలో ఉన్న కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు రూ.1,413 కోట్ల మేరకు ఆస్తులు ఉన్నాయి. మూడోస్థానంలో ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు ఆస్తుల విలువ రూ.931 కోట్లు. నాలుగో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి నారాయణ ఆస్తులు రూ.824 కోట్లు. ఐదో స్థానంలో ఉన్న కర్ణాటక మంత్రి సురేశ్ కు రూ.648 కోట్ల ఆస్తులున్నాయి. ఆరో స్థానంలోని తెలంగాణ మంత్రి గడ్డం వివేకానంద్ ఆస్తుల విలువ రూ.606 కోట్లు. ఏడో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి లోకేశ్ ఆస్తుల విలువ రూ.542 కోట్లు. ఎనిమిదో స్థానంలో ఉన్న మహారాష్ట్ర మంత్రి మంగళ్ ప్రభాత్ లోఢా ఆస్తుల విలువ రూ.447 కోట్లు. తొమ్మిదో స్థానంలోని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆస్తుల విలువ రూ.433 కోట్లు. పదో స్థానంలోని మధ్యప్రదేశ్ కు చెందిన కేంద్ర మంత్రి జ్యోతిరాధిత్య సింధియా ఆస్తుల విలువ రూ.424 కోట్లు. కాగా, అతితక్కువ ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో త్రిపురకు చెందిన శుక్ల చరణ్ నోషియాకు కేవలం రూ.2 లక్షలు మేరకు మాత్రమే ఆస్తులు ఉండడం గమనార్హం. కాగా, ఆస్తులతోపాటు అత్యధిక అప్పులు ఉన్న మంత్రుల్లో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన అప్పుల విలువ 1,038 కోట్ల మేరకు ఉన్నాయి. ఏపీ మంత్రి నారాయణ అప్పుల విలువ 190 కోట్లు ఉంటుందని ఏడీఆర్ తెలిపింది.

లోకం తీరు



కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర నివాసంపై మళ్లీ ఈడీ దాడులు

బెంగళూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర పప్పీ నివాసంపై ఈడీ అధికారులు మరోసారి దాడులు నిర్వహించారు. చెళ్లకెరె నగరంలోని ఆయన నివాసంలో తనిఖీలు జరిపారు. బ్యాంకు ఖాతాలలో ఉన్న రూ.55 కోట్లను జప్తు చేశారు. ఎమ్మెల్యే వీరేంద్ర అక్రమ బెట్టింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఈడీ అధికారులు గుర్తించి, ఇటీవల అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన ఈడీ కస్టడీలో ఉన్నారు. విచారణలో సేకరించిన సమాచారం ఆధారంగా బుధవారం మరోసారి దాడులు నిర్వహించారు. 5విలాసవంతమైన కార్లను, బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.55కోట్లను జప్తుచేశారు. వీరేంద్ర తక్కువ సమయంలోనే ఏకంగా రూ.2వేల కోట్లు సంపాదించారని ఈడీ గుర్తించింది. దుబాయిలో ఉన్న ఆయన సహచరులు కూడా ఇదే దందా సాగిస్తున్నట్లు గుర్తించారు.

ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ ఆర్మనీ కన్నుమూత

మిలన్, సెప్టెంబరు 4: ఇటలీకి చెందిన ప్రపంచ ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ జియోర్గియో ఆర్మనీ కన్నుమూశారు. ఆయన వయసు 91 ఏళ్లు. తాను నెలకొల్పిన జియోర్గియో ఆర్మనీ ఫ్యాషన్ హౌస్ 50 ఏళ్ల ఉత్సవాన్ని ఈ నెలలో నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్న సమయంలోనే ఆయన తుది శ్వాస విడిచారు. సాధారణ ఇటాలియన్ ప్యాంటు, షర్టు వంటి రెడీమేడ్ దుస్తులతో వ్యాపారాన్ని ప్రారంభించి 10 బిలియన్ డాలర్ల సామ్రాజ్యంగా విస్తరించారు. సౌందర్య దృష్టిని వ్యాపారంగా మార్చడంలో విజయం సాధించిన పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొందారు. 1934 జూలై 11న పియాసెంజా అనే చిన్న పట్టణంలో జన్మించిన ఆయన తొలుత ఓ డిపార్ట్‌మెంట్ స్టోర్‌లో పనిచేశారు.

కర్ణాటక వాసి దారుణ హత్య

అమడగూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకులోల్లపల్లి సమీపంలోని వంకలో కర్ణాటక రాష్ట్రంలోని బిళ్లురు పంచాయతీ దేవరంక గ్రామానికి చెందిన ముత్తప్ప (47) బుధవారం రాత్రి హత్యకు గురయ్యాడు. కర్ణాటక రాష్ట్రంలోని చింతామణికి చెందిన శ్రీనివాసులరెడ్డితో కలిసి ముత్తప్ప రెండేళ్లుగా వ్యవసాయం చేస్తుండేవాడు. వీరు ఆకులోల్లపల్లి సమీపంలో వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని పంటలు సాగు చేసేవారు. ముత్తప్ప నిత్యం స్వగ్రామం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పొలం వద్దకు వెళ్లి వచ్చేవాడు. రోజువారీలాగానే వ్యవసాయం పొలానికి వెళ్లి తిరిగి వస్తుండగా బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో దాడిచేసి తలపై గొడ్డలితో నరికారు. దీంతో ముత్తప్ప అక్కడికక్కడే మృతిచెందాడు. ముత్తప్ప ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్తుండగా వంక గట్టున విగత జీవిగా పడి ఉండటం గమనించి పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ విజయ్‌కుమార్, సీఐ నరేంద్రకుమార్‌రెడ్డి, ఓడీసీ ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పరిశీలించారు. భార్య ప్రమీల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తుచేస్తున్నారు.

కుమ్మర్లను గుర్తించిన ఘనత టీడీపీదే..!

రాష్ట్ర కుమ్మర శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వర్

అనంతపురం రూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కుమ్మర్లను గుర్తించిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని రాష్ట్ర కుమ్మర శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్ అన్నారు. మండలంలోని రాచానపల్లి గ్రామ సమీపంలోని కుమ్మర శాలివాహన కమ్యూనిటీ హాల్లో గురువారం కుమ్మర కులస్థుల ఆత్మీయ కలయిక నిర్వహించారు. కుమ్మర సాధికార సమితి శ్రీసత్యసాయి జిల్లా కన్వీనర్ రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఈశ్వర్ హాజరై మాట్లాడారు. కుమ్మర్లు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. టీడీపీ ఇందుకు అనువైన వేదికన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కుమ్మర్లకు మంచి స్థానం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. విద్యలో రాణిస్తున్న కుమ్మరి పిల్లలకు చేయూతనివ్వాలన్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరమైన సమస్యల కారణంగా రుణాల మంజూరుకు మరికొంత సమయం పడుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్ నాగేంద్ర, సాధికార సమితి రాష్ట్ర డైరెక్టర్ ఓబుళపతి, రైతు సంఘం ప్రధానకార్యదర్శి యాలేటి గోపాల్, ఆంజనేయులు, మల్లికార్జున, వెంకటనారాయణ, కిష్ట, హనుమంతు, రాజేంద్ర, తేజ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కుమ్మర శాలివాహన రాష్ట్ర చైర్మన్ ఈశ్వర్

10న జాబ్‌మేళా

ధర్మవరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 10న జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు కళాశాల సురేష్ బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ గురువారం తెలిపారు. జాబ్ మేళాకు 10 కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, పీజీ పూర్తి చేసి 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉన్నవారు జాబ్ మేళాలో పాల్గొనవచ్చని అన్నారు. ఎంపికైన వారికి నెలకు జీతం రూ.15 వేల నుంచి రూ.25వేల వరకు ఉంటుందన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారు హైదరాబాద్, బెంగళూరు, అనంతపురం, ధర్మవరం, పెనుకొండ ప్రాంతాల్లో ఉద్యోగం చేయాల్సి ఉంటుందన్నారు. 9182288465 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

విజిలెన్స్ దాడులు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఫర్టిలైజర్స్ దుకాణాల్లో అక్రమ నిల్వలపై విజిలెన్స్ దాడులు చేసి, నోటీసులు అందించారు. గురువారం ఏడు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. మూడు దుకాణాల్లో ఎరువుల నిల్వలు స్టాక్‌కు, ఈపోష్ మిషన్లలో ఉన్న డేటాకు వ్యత్యాసం ఉన్నట్టు గుర్తించారు. రూ. 4.33 లక్షల విలువైన 15.90 మెట్రిక్ టన్నుల ఎరువుల విక్రయాలు ఆపాలంటూ నోటీసులు అందించారు. దాడుల్లో డీఎస్పీ నాగభూషణం, సీఐలు శ్రీనివాసులు, వ్యవసాయాధికారి వాసు ప్రకాష్ పాల్గొన్నారు.

వామ్మో.. విశాఖ వెళ్లాలా..?

● త్వరలో దక్షిణ కోస్తా రైల్వే జోన్ నోటిఫికేషన్ ● జోనల్ కేంద్రంగా విశాఖపట్టణం

గుంతకల్లు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రైల్వే జోన్ మారాల్సి రావడం గుంతకల్లు డివిజన్‌కు ఎన్నో కష్టాలు తెచ్చిపెట్టనుంది. జోనల్ కేంద్రంగా విశాఖపట్టణాన్ని ఏర్పాటు చేస్తుండడంతో గుంతకల్లుకు దూరం కానుంది. జోనల్ కేంద్రానికి వెళ్లాలంటే అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు చాలా ఇక్కట్లు పడాల్సిందే. రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా ఉన్న ఏపీకి ప్రత్యేక రైల్వే జోన్ గెజిట్ నోటిఫికేషన్ సమయం దగ్గరపడింది. నెలాఖరులోగా నోటిఫికేషన్ విడుదలచేసి, దసరా తర్వాత దక్షిణ కోస్తా రైల్వేజోన్ సొంత కార్యకలాపాలు, పరిపాలన సాగించే విధంగా మార్గం సుగమమౌతోంది. రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టాన్ని అనుసరించి ఏపీకి కొత్త రైల్వేజోన్ ఏర్పాటు చేయాల్సి ఉంది. 2019 ఫిబ్రవరిలో కేంద్ర ప్రభుత్వం సౌత్ కోస్టల్ రైల్వే జోన్ ప్రకటన చేసింది. ఇప్పటిదాకా జీఎంను, మూడు శాఖలకు చీఫ్ ఇంజనీర్లను నియమించింది. ఇంకా పలు శాఖల హెచ్ఓడీలను నియమించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అధికారిక నోటిఫికేషన్ త్వరలో వెలువడనుందని సమాచారం. నెలాఖరులోగా గెజిట్ నోటిఫికేషన్ వెలువడి దక్షిణ కోస్తా రైల్వేజోన్ కార్యాచరణ ప్రారంభం కానుంది. గుంతకల్లు రైల్వే డివిజన్ దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధి నుంచి దక్షిణ కోస్తా రైల్వేజోన్ పరిధిలోకి మారనుంది. ఈ మార్పు ద.కో.రై. డివిజన్‌లోని ఇతర డివిజన్లకు ఎటువంటి ఇబ్బంది లేకపోగా, జోనల్ కేంద్రానికి అతి దూరంలో ఉన్న గుంతకల్లు డివిజన్‌కు మాత్రం కష్టాలు తెచ్చిపెట్టనుంది.

ప్రజలు, ప్రజాప్రతినిధులకు కష్టాలు

దక్షిణ కోస్తా రైల్వే జోనల్ కేంద్రం విశాఖపట్టణంలో ఏర్పడనుండగా ఇటు ప్రజలు, అటు రాయలసీమ జిల్లాల ప్రజాప్రతినిధులకు కష్టాలు తెచ్చిపెట్టనుంది. రైల్వే ఉద్యోగులు చనిపోయిన సందర్భాల్లో కారుణ్య నియామకాలు పొందేవారు జీఎం ఆఫీసుకు వెళ్లాల్సి వస్తే చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. కారుణ్య నియామకాలు సాధారణంగా డీఆర్ఎం పరిధిలో పరిష్కారం అవుతాయి. డీఆర్ఎం తిరస్కరిస్తే అప్పీల్ కోసం జోనల్ కార్యాలయానికి వెళ్లాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఉన్న ద.మ.రై. జోనల్ కేంద్రం సికింద్రాబాద్ రైలు మార్గంలో 365 కి.మీ.లు, బస్సు మార్గంలో 347.6 కి.మీ.ల దూరం ఉంది. కొత్త జోన్‌లోకి మారితే రైలు మార్గంలో వెళ్లాలంటే 783 కి.మీ.లు ఉండగా, బస్సు మార్గంలో 808.5 కి.మీ.ల దూరం ఉంది. ఎంపీలు ఏదైనా రైల్వే సమస్యలు, ప్రతిపాదనల విషయంగా జోనల్ కేంద్రానికి వెళ్లాల్సి వస్తే రెండు రోజుల సమయం పడుతుంది.

ఉద్యోగులకూ కష్టాలే...

రైల్వే జోనల్ కేంద్రం దూరమైపోనుండడం రైల్వే ఉద్యోగులు, అధికారులకు సమస్యగా మారనుంది. రైల్వే ఆస్పత్రుల్లో పనిచేసే మినిస్టీరియల్ స్టాఫ్, వైద్యాధికారులు శిక్షణా కార్యక్రమాలకు సాధారణంగా రైల్వే జోనల్ కేంద్రానికి వెళ్లాల్సి ఉంటుంది. లోకో పైలెట్లు, చీఫ్ లోకో ఇన్‌స్పెక్టర్లు, గార్డులు ట్రైనింగ్ కోసం జోన్ హెడ్ క్వార్టర్స్‌కు వెళ్లాల్సి ఉంటుంది. అలాగే జోనల్ సీనియారిటీ కిందకు వచ్చే ఎస్ఎస్ఈ (డీజిల్), ఎస్ఎస్ఈ (ఎలక్ట్రికల్) తదితర అధికారులు తప్పనిసరిగా జోనల్ కేంద్రానికి వెళ్లాల్సి ఉంటుంది. డీఆర్ఎం తదితర సబార్డినేట్ అధికారులు సైతం జోనల్ హెడ్‌క్వార్టర్స్‌కు తరచుగా వెళ్లాల్సి వస్తుంది. వీరు రైల్వే శాఖకు చెందినవారు కావడంతో సమావేశాలకు విశాఖపట్టణానికి వెళ్లాలంటే విమాన ప్రయాణం చేయడానికి వీలులేదు. రైలులోనే ప్రయాణించాలి. మీటింగ్‌కు వెళ్లడానికోరోజు, రావడానికో రోజు జర్నీ తప్పదు. దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడే రైల్వే ఉద్యోగులను మొదట జోనల్ హెడ్ క్వార్టర్స్‌కు రెఫర్ చేస్తారు.

బోగస్‌లు బద్దలు..!

అనంతపురం విద్య, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025 నియామకాల్లో బోగస్‌లు బయటపడుతున్నాయి. బోగస్ సర్టిఫికెట్లతో ఎంపికైన వారు రీ వెరిఫికేషన్‌లో అడ్డంగా దొరికిపోతున్నారు. ఎంపిక జాబితాలో ఉన్న అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను ప్రత్యేక బృందాలు పరిశీలన చేస్తున్నాయి. ఇప్పటికే జిల్లాలో 807 పోస్టులకుగాను 770 మంది అభ్యర్థుల జాబితా రావడంతో జిల్లాకేంద్రంలోని పీవీకేకే కళాశాలలో వెరిఫికేషన్ చేపట్టారు. ఇంకా 37మంది అభ్యర్థుల జాబితా విడుదల కావాల్సి ఉంది. ఇప్పటివరకు సెలెక్ట్ జాబితాలో వచ్చిన పలువురు అభ్యర్థులు బోగస్ సమాచారం పెట్టి దరఖాస్తు చేయగా.. వెరిఫికేషన్‌లో సంబంధిత సర్టిఫికెట్లు చూపించలేక పట్టుబడిపోతున్నారు. పలువురు బోగస్ ఈడబ్ల్యూఎస్ (ఆర్థికి బలహీన వర్గాల) సర్టిఫికెట్లు పెట్టారని ఫిర్యాదులు అందాయి. రాష్ట్రశాఖ మరోసారి అభ్యర్థులు ఇచ్చిన సర్టిఫికెట్లను మాన్యువల్‌గా పరిశీలించి, సమాచారం పంపాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో గురవారం పాత డీఈఓ కార్యాలయంలో ఇప్పటి వరకు వచ్చిన 770 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను మరోసారి రీవెరిఫికేషన్ చేపట్టారు. ఇందులో మరో రెండు బోగస్ వ్యవహారాలు వెలుగులోకి వచ్చాయి.

ఉద్యోగాలు చేస్తూ..

ఎక్స్ సర్వీస్‌మెన్ కింద దరఖాస్తు

డీఎస్సీ నియామకాల్లో ఎక్స్ సర్వీస్‌మెన్ కింద ప్రత్యేక కోటా ఉంటుంది. ఆ కోటా అభ్యర్థులకు అర్హత మార్కులు ఉంటే ఉద్యోగాలు ఇస్తారు. ఈ పోస్టులను దక్కించుకునేందుకు ఇద్దరు అభ్యర్థులు అదికూడా ఇప్పటికే ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు దరఖాస్తు చేసుకుని, అడ్డంగా దొరికిపోయారు. ఇది విద్యాశాఖ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. స్కూల్ అసిస్టెంట్ బయాలజీ సబ్జెక్టులో ఇప్పటికే ఎస్జీ టీచర్‌గా పనిచేస్తున్న అభ్యర్థి ఎక్స్ సర్వీస్‌మెన్ కింద దరఖాస్తు చేసుకున్నాడు. ఈయన పేరు మొదట విడుదల చేసిన సెలెక్షన్ జాబితాలోనే వచ్చింది. ఈయన పీవీకేకేలో జరుగుతున్న వెరిఫికేషన్‌కు హాజరుకాగా.. పరిశీలన బృందం ఎక్స్ సర్వీస్‌మెన్ సర్టిఫికెట్ ఇవ్వాలని కోరింది. దానిని చూపించకపోగా.. తాను ఇప్పటికే ఎస్జీ టీచర్‌గా పనిచేస్తున్నానన్నాడు. దీంతో కమిటీ బృందం నవ్వుకుని, అలా అయితే రిజెక్ట్ చేస్తున్నట్లు చెప్పింది. అందుకు అతడు అంగీకరిస్తూ.. రాసిచ్చి వెళ్లాడట. అదే బయాలజీ పోస్టుకు మరో అభ్యర్థిని ఎక్స్ సర్వీస్‌మెన్ కింద ఎంపిక చేసి పంపారు. వెరిఫికేషన్‌లో ఎక్స్ సర్వీస్‌మెన్ సర్టిఫికెట్ చూపాలని అడగ్గా.. తన దగ్గర లేదన్నారట. అలా అయితే అనర్హుడవని చెప్పగా.. తన సెలెక్షన్ రద్దు చేయాలని రాసిచ్చి వెళ్లాడట. ఆ అభ్యర్థి కూడా సచివాలయ ఉద్యోగిగా పనిచేస్తున్నట్లు చెప్పారట. అంటే ఇక్కడ ఈ ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తూనే ఎక్స్ సర్వీస్‌మెన్ కింద ఎలా దరఖాస్తు చేసుకున్నారన్నది అంతుచిక్కని విషయం. అవకాశం వస్తే టీచర్ ఉద్యోగానికివెళ్లేవారే. పరిశీలన పక్కాగా చేస్తుండడంతో దొరికిపోయారు. ఇపుడు చేస్తున్న ఉద్యోగాలుకూడా ఇలాగే ఎక్స్‌సర్వీస్‌మెన్‌గానీ, ఇతర బోగస్ సర్టిఫికెట్లు చూపించిగానీ పొందారా..అనే అనుమానాలు తలెత్తుతున్నాయి.

రెవెన్యూ శాఖ నిర్లక్ష్యం

డీఎస్సీలో ఈడబ్ల్యూఎస్ పేరుతో బోగస్ సర్టిఫికెట్లను పెట్టారని సెలెక్ట్ అభ్యర్థులపై ఫిర్యాదులు అందాయి. వారి వివరాలతో కలెక్టర్, డీఈఓకి ఫిర్యాదులు చేశారు. వీటిపై కలెక్టర్ వినోద్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటిని రీ వెరిఫికేషన్ చేయించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లా విద్యాశాఖ అధికారులు ఈడబ్ల్యూఎస్ కింద ఎంపికై ఆరోపణలు వస్తున్న ఆరుగురు అభ్యర్థులకు సర్టిఫికెట్లను జారీచేసిన తహసీల్దార్లతో పంపి, వాస్తవ సమాచారం పంపాలని కోరారు. మూడురోజులైనా రెవెన్యూ అధికారులు వాటి గురించి సమాచారం జిల్లా విద్యాశాఖకు పంపలేదు. అభ్యర్థుల ఫైనల్ ఎంపిక జాబితాసిద్ధం చేయడానికి యంత్రాంగం సిద్ధమవుతోంది. రెవెన్యూ పరిశీలనకు పంపిన ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు ఒరిజినలా, బోగసా.. అన్నది తేల్చలేదు. దీంతో విద్యాశాఖ అధికారులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. అర్హత ఉన్న అభ్యర్థులు ఎటూ తేలక టెన్షన్ పడుతూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు.

పీహెచ్ సర్టిఫికెట్లపైనా సందిగ్ధత

పీహెచ్ కోటా కింద ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లపైనా సందిగ్ధత కొనసాగుతోంది. కురబ శ్రీనివాసులు అనే అభ్యర్థి ఎంఐ (బుద్ధిమాంద్యత) కోటాలో ఎంపికయ్యారు. ఆయనను జిల్లా ఆస్పత్రికి వెళ్లి వైద్యుడితో పరీక్షించుకుని రావాలని చెప్పగా.. అక్కడకు వెళ్లి డాక్టర్లకు చెప్పాపెట్టకుండా వెళ్లిపోయారట. దీంతో సంబంధిత డాక్టర్.. ఆ అభ్యర్థి పరిశీలన చేయించుకోకుండా వెళ్లిపోయారని విద్యాశాఖకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆ అభ్యర్థి ఎంపికను పరిశీలన బృందం రిజెక్ట్ చేసింది. ఆ తర్వాత సంబంధిత అభ్యర్థికుటుంబసభ్యులు కమిషనర్ వద్దకెళ్లి తాము పారిపోలేదనీ, సర్టిఫికెట్ల పరిశీలన చేస్తున్న పీవీకేకే కళాశాల వద్దకే వెళ్లామనీ, న్యాయం చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన కమిషనర్.. నేరుగా డీఈఓనే ఆ అభ్యర్థిని తీసుకెళ్లి వైద్యుడితో పరీక్ష చేయించాలని ఆదేశించారు. దీంతో గురువారం జిల్లా ఆస్పత్రికి డీఈఓ ప్రసాద్‌బాబు, ఏపీఓ మంజునాథ్.. సంబంధిత అభ్యర్థిని తీసుకెళ్లి వైద్యుడితో పరీక్ష చేయించారు. మరో సెలెక్ట్ అభ్యర్థి తమకు ఇటీవల జారీచేసిన సదరం సర్టిఫికెట్‌లో 50శాతంపైగా వైకల్యం ఉన్నట్లు పేర్కొన్నారనీ, తాజాగా 35శాతం ఇచ్చి తనకు అన్యాయం చేస్తున్నారని కమిషనర్‌కు విన్నవించుకున్నారు. ఆ అభ్యర్థికి ప్రత్యేకంగా కారు సమకూర్చి పరిశీలన నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ పరిస్థితుల్లో తుది జాబితా విడుదల సందిగ్ధంలో పడింది. ఈడబ్ల్యూఎస్, పీహెచ్ కోటాల అభ్యర్థుల వ్యవహారం తేలేవరకు జాబితా విడుదల చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో విద్యాశాఖ అధికారులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

రేపు వామపక్షాల నిరసనలు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): అమెరికా టారిఫ్‌లను నిరసిస్తూ ఈనెల 6న జిల్లావ్యాప్తంగా నిరసనలు చేపట్టనున్నట్లు వామపక్ష నేతలు తెలిపారు. సీపీఎం, సీపీఐ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శులు నల్లప్ప, నారాయణ స్వామి, ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌యూసీఐసీ జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర గురువారం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. భారతీయ సరుకుల దిగుమతులపై సుంకాన్ని 50 శాతానికి పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడం దేశ ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపిందన్నారు. ఆక్వా, టెక్స్‌టైల్స్, గార్మెంట్స్ వంటి ఉత్పత్తుల ధరలు ఘోరంగా పడిపోయాయన్నారు. దేశ సముద్ర ఉత్పత్తుల్లో 40 శాతం ఏపీ నుంచే ఎగుమతి అవుతున్నాయన్నారు. టారిఫ్ పెంపుతో రాష్ట్రం నుంచి ఎగుమతి అయ్యే రొయ్యల ధరలు ఘోరంగా పడిపోవడంతో సముద్ర తీర ప్రాంతాల్లోని రొయ్యలు, చేపల రైతులు తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్నారన్నారు. గార్మెంట్స్, టెక్స్‌టైల్స్ రంగాలు, స్పిన్నింగ్ మిల్లుల్లో పనిచేస్తున్న వేలాదిమంది కార్మికుల ఉపాధికి ప్రమాదం పొంచి ఉందన్నారు. భారత ఎగుమతులపై సుంకం పెంచి, అమెరికా నుంచి వ్యవసాయ ఉత్పత్తులను పన్నులు లేకుండా దిగుమతి చేసుకోవాలనీ, రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు ఆపాలని అమెరికా షరతులు పెడుతోందన్నారు. ఇన్ని విధాలుగా ట్రంప్ సర్కారు భారత ప్రయోజనాలను, సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తున్నా కేంద్రంలోని మోదీ సర్కారు కిమ్మనకపోవడం గర్హనీయమన్నారు. ఈ విధానాలను నిరసిస్తూ శనివారం జిల్లావ్యాప్తంగా అన్ని మండల, పట్టణ ప్రాంతాల్లో నిరసనలు చేపడతామన్నారు. అన్నివర్గాల ప్రజలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.